ప్రజాశక్తి

Vol. 1, no. 21

(Nov. 4, 1942)

బెజవాడ, 1942

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 21

(Nov. 4, 1942)

Bejavāḍa, 1942

12 పేజీలు : 0-1-6

PRAJA SAKTI

Regd. No. M. 4486.

సంపాదక వర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు
(సంపాదకుడు)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

అంతర్జాతీయ పార్టీశాఖ
భారత కమ్యూనిస్టుపార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 1 | బుధవారం 4-11-42 బెజవాడ | సంచిక 21

ఆంధ్ర స్త్రీలకు ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ విజ్ఞప్తి

కామ్రేడ్
పుచ్చలపల్లి సుందరయ్య

జపాను ఫాసిస్టుహంతకులు, అస్సాం, చిట్టగాంగు ప్రాంతాలలో ఆకాశంనుండి బాంబులవర్షం కురిపిస్తున్నారు. మన పవిత్రభారత భూమిపై - ముఖ్యంగా సముద్రతీర ప్రాంతాలలోని ఆంధ్రభూమిపై - జపానుదాడి భయం రోజురోజుకూ హెచ్చుతోంది. రష్యాలో నాజీ రాక్షసులు, చైనాలో ఫాసిస్టు ముష్కరులు, స్త్రీలపై గావించిన అమానుష చర్యలు, హింసలు, మనదేశంలో కూడ మనతల్లులు అక్కచెల్లెండ్రు, భార్యాబిడ్డలు ఎదుర్కోవలసిన పరిస్థితులు వస్తున్నాయి.

ఈమధ్య నేను రైలులో సైనికులతో నిండివున్న పెట్టె యెక్కి వస్తున్నాను. చినగంజాం స్టేషనులో ఒక బిక్షకురాలు తన ముసలి గుడ్డితండ్రితో ఎక్కింది. ఒక సైనికుడు ఆమెచేతిని పట్టుకోడానికి చేయి సాచాడు. మిగిలిన సైనికులంతా అతనిని మందలించి నివారించారు. ఆ క్షణంలో ఆ బిచ్చగత్తె ముఖంలో గంభీరత, కోపం, ఆ సైనికునిపై అసహ్యత, చూచి తీరాల్సిందే. ఆమె ముఖంలో స్త్రీజాతి అంతటి ఆత్మగౌరవం, మానరక్షణకై పట్టుదల, ఔన్నత్యం వుట్టిపడిందనవచ్చు. అది మరపురాని దృశ్యం.

ఇంత ఆత్మాభిమానం, మానరక్షణకై పట్టుదల గల మన స్త్రీ లంతా, జపాను ఫాసిస్టు పెనుభూతాలు మన దేశంమీదకు వచ్చినప్పుడు పడాలిసిన హింసలు తలచుకొని కంపించిపోయాను. మన స్త్రీలకు ఆత్మరక్షణాపద్ధతులు నేర్పాలి, యుద్ధం అరాజకం, దేశమంతా వ్యాపించి నప్పుడు, తన మానాన్ని తన ఆత్మగౌరవాన్ని రక్షించుకోడానికి ప్రతి స్త్రీ, ఏమైనా చేస్తుంది. ఎంత త్యాగానికైనా, ఎంత కష్టనష్టాలకైనా ఓర్చుకుంటుంది. తనకు ఆత్మరక్షణా పద్ధతులు నేర్పే మహిళాసంఘాలుంటే, వాటిలో లక్షలకొలది చేరుతారు. మహిళాసంఘాలు నేడే కార్యక్రమానికి వెంటనే పూనుకోవాలి. స్త్రీ ఉద్యమాన్ని- అంతేగాదు- స్త్రీజాతినే ఒక నూతన దశకు ఈ కార్యక్రమం తీసుకుపోతుంది.

మహిళా లోకాన్ని స్త్రీలే సమీపించాలి. పురుషులమైన మేము చేయలేని పని ఇది. ఈ పని గావించడానికి పార్టీసభ్యుల తల్లులు, అక్కచెల్లెండ్రు, భార్యలు ముందుకురావాలి. ఆంధ్రావనిలోని ప్రతి గ్రామ గ్రామమూ, ప్రతి మూల మూలా, స్త్రీలోకానికి జపాను దుండగీడుల నుండి రాబోయే మహా ప్రమాదాన్ని తల్లుల యెదుటే పసిపిల్లలను చిత్రవధగావించే జపాను ఫాసిస్టుల ఘోర ప్రమాదాన్ని-తెలియజెప్పాలి. స్త్రీలోకాన్నంతా జపానుదాడిని ఎదుర్కోడానికి గావలసిన జాతీయైక్యత, జాతీయ ప్రభుత్వనిర్మాణకార్యక్రమానికి పూనుకొనేటట్లు చేయాలి. ప్రధానంగా ఆత్మరక్షణోపాయాలను నేర్పాలి. మన కమ్యూనిస్టు పార్టీ సభ్యుల భార్యలు, అక్కచెల్లెండ్రు, తల్లులు, తమ భర్తలకు, అన్నదమ్ములకు, పుత్రులకు తగినవారై ముందుకురావాలి.



ఆంధ్రస్త్రీలకు ఆదర్శమైన సోవియట్ గెరిల్లా వీరవనిత

కమ్యూనిస్టులు ఏరీతిగా ప్రజాసామాన్యాన్నంతా జపానుదాడినెదుర్కోడానికి, భారతస్వాతంత్ర్య సంపాదనానికి సంసిద్ధపరచుచూ పనిజేస్తున్నారో, అదేరీతిగా వారిభార్యలు, అక్కచెల్లెండ్రు తల్లులు, మహిళాలోకాన్నంతా సంసిద్ధ పరచి స్త్రీజాతి మానాన్ని జపాను ఫాసిస్టు పెనుభూతాలనుండి రక్షించడానికి, స్త్రీజాతి స్వాతంత్ర్యాన్ని, భారతదేశ స్వాతంత్ర్యాన్నికూడా సంపాదించడానికి పనిచేయాలి.

పార్టీసభ్యుల, భార్యలకు, అక్కచెల్లెండ్రకు, తల్లులకు విజ్ఞప్తి.

జపాను ఫాసిస్టులు ఆక్రమించుకొన్న ప్రదేశంలో, కమ్యూనిస్టుల భార్యలుగా, అక్కచెల్లెండ్రుగా, తల్లులుగా మీరుండటమే, జపాను ఫాసిస్టులదృష్టిలో తగినంత నేరం. కమ్యూనిస్టులను వేటాడడానికి, హింసించడానికి, వారి భార్యా బిడ్డలను అక్క చెల్లెండ్రను, తల్లిదండ్రులను, జపాను దుండగీడులు, అష్టకష్టాలు పెట్టి హింసింపుతారు. తమ భార్యా బిడ్డల, అక్క చెల్లెండ్ర, తల్లిదండ్రుల, పరిస్థితులను పక్కపెట్టడానికి, కమ్యూనిస్టు పార్టీ సభ్యులకు తీరికవుండదు. వారిని వెంటబెట్టుకొని కాందిశీకులవడం వారిపనిగాదు. వారు జపాను శత్రు సేనలవెనుకా, ముందూ ప్రజలను సంసిద్ధ పరచుచూ జపాను ఫాసిస్టులతో తాము ఢీకొంటూ ఉంటారు. అప్పుడు మిమ్ములను మీరే రక్షించుకోవాలని వుంటుంది. మీరు స్త్రీ లోకాన్నంతా తయారుచేస్తే, ఆత్మరక్షణోపాయాలు నేర్పితే, వారు మిమ్ములను దాచుతారు; రక్షిస్తారు. మీరూ వారూ కలిసి, జపాను శత్రువులతో ఢీకొంటున్న మాకందరికీ, మన ప్రజలందరికీ, గావలసినంతగా తోడ్పడగల్గుతారు. శత్రువులను తరిమివేసి, భారత భూమిని స్వాతంత్ర్య భూమిగా చేయగల్గుతాము. ఈ రోజులలో ఇండ్లలో కూర్చుని ఉండడము, మీక్షేమానికి, మీభర్తల, బిడ్డల క్షేమానికి, మీ సోదరస్త్రీల క్షేమానికి, మన ప్రజలందరి క్షేమానికీ వినాశకరం. ఇండ్లువదలి ముందుకురావాలి, స్త్రీ లోకాన్నంతా ప్రబోధం గావించడానికి, ముందుకు రావాలి. మీ మానాభిమానాలను, మీతోటి స్త్రీల మానాభిమానాలను, మీబిడ్డల ప్రాణాలను రక్షించుకోడానికి ముందుకు రావాలి.

పార్టీసభ్యులకు విజ్ఞప్తి

కామ్రేడ్స్! జపాను ఫాసిస్టులు పెట్టే అనేక బాధలు మీరు సహించగల్గుతారని మాకు తెలుసు. మానవుడు, తన్ను ఎన్ని బాధలు పెట్టినా సులభంగా సహిస్తాడు గాని, తనకు మహాప్రియులైనవ్యక్తులు బాధపడుతూ ఉండడం సహించడు. మానవుని సహనానికి ఆఖరిమెట్టు, బిడ్డలను హింసిస్తూ వున్నప్పుడు చలించని తల్లులు, తమకు ప్రియులైన భార్యాబిడ్డలు హింసింపబడుతున్నప్పుడు, చలించక తమ కర్తవ్యాన్ని చేయగల పురుషులు అరుదు. వారు ఆదర్శవ్యక్తులు, ప్రతి పార్టీ సభ్యుడు అవసరం వచ్చినప్పుడు, ఈ అంతిమ త్యాగానికి గూడ సంసిద్ధుడవుతాడని మాకు నమ్మకముంది. అయితే పార్టీకమిటీల బాధ్యత, తమ సభ్యులను ఇట్టి అంతిమ పరీక్షలకు లోనుగాకుండా చూడడం. మీరు ఎక్కువగా ప్రేమించేవారిని, మీభార్యాబిడ్డలను ఈ జపానుఫాసిస్టు పెనుభూతాలబారి బడకుండా, కాపాడడానికి ఒకటే మార్గం వుంది. వారికి రాజకీయచైతన్యం కలుగజేయాలి. వారు మహిళా లోకాన్నంతా ప్రబోధించేటట్లు చేయాలి. స్త్రీ లందరి సంరక్షణలోనే తనసంరక్షణ తనబిడ్డలసంరక్షణ కూడ వుందని ఆమె తెలుసుకొనేటట్లు చేయాలి. మీభార్యలను, అక్కచెల్లెండ్రను, తల్లులను నేడు మహిళాలోకంలో పనిచేయడానికి ఇండ్లనుండిబయటకువచ్చేటట్లు చేయాలిసినబాధ్యత మీపై వుంది.

కామ్రేడ్స్! ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ ఆదేశానుసారం, మీకు మీ భార్యలకు అక్కచెల్లెండ్రకు, తల్లులకు, ఆంధ్రస్త్రీలందరికీ ఈ విజ్ఞప్తి గావించుచున్నాను.

మన స్త్రీలకు ఆత్మరక్షణోపాయాలు నేర్పుదాం!

మనమూ మనస్త్రీలూ భుజం భుజం కలిపి,
జపాను ఫాసిస్టుల దునుమాడడానికి,
జాతీయైక్యతను, జాతీయ ప్రభుత్వాన్ని
నిర్మిద్దాం.

ప్రజాశక్తి

4-11-42 బుధవారం

జాతీయైక్యతకు కదలి రండు!

నవంబరు 1 వ తేదీనుండి కమ్యూనిస్టు పార్టీ దేశమంతటా "జాతీయైక్యతా వారము"ను జరుపుతోంది. ఈ వుద్యమంలోని ప్రధాన నినాదాలు యివి: కాంగ్రెసు నాయకులను విడుదల చేయాలి; నిర్బంధ విధానం ఆపుజేయాలి; జాతీయ ప్రభుత్వంకొరకు, దేశ రక్షణ కొంకు, కాంగ్రెసు - లీగు ఒడంబడికను సాధించాలి.

మన దేశ చరిత్రలో యెన్నడూ కలుగని అత్యంత విషమావస్థ నేడు యేర్పడింది. ఇట్టి సమయాన కమ్యూనిస్టు పార్టీ జాతీయైక్యతకై బ్రహ్మాండమైన పోరాటం ప్రారంభిస్తున్నది. మన పొలిమేరలోనే వున్న శత్రువు మనపై అప్పుడే దెబ్బతీయ ప్రారంభించాడు. శత్రు విమానాలు చిట్టగాంగును, అస్సాంలో అనేక ప్రదేశాలను బాంబు చేసినాయి. భారతీయుల యిప్పు వాకిళ్ళు పరశురామ ప్రీతి చేయబడ్డాయి. శత్రుసేన లిక లోపల జొరబడుటే తరువాయి; చైనాలో జరిగిన దారుణ హత్యకాండ, దోపిడీలు, బానిసత్వము, యిక్కడకూడా ప్రదర్శింపబడగలవు.

కేవలం భారతీయులై పుట్టిన నేరానికి యెంతమంది అమాయక ప్రజలీ చిచ్చు బాంబులకు ఆహుతి యైనారో! ఎంతమంది దిక్కుమాలిన వారైనారో! ఎంతమంది బాల బాలికలు, స్త్రీ పురుషులు, హతులయారో!

ఈ జపాను హంతకుల కిరాత కృత్యాలకు మనం ప్రతీకారం తీసుకుతీరాలి; దెబ్బకు రెండు దెబ్బలు తీయాలి; మన మాతృ భూమి పవిత్రతను, మన భార్యా బిడ్డల మాన ప్రాణాలను, మన ప్రజల స్వాతంత్ర్యాన్ని రక్షించుకొనితీరాలి. మనమెట్టి ప్రమాద స్థితిలోవున్నామో, యీ హత్యలు తెలియ జేస్తాయి. స్వాతంత్ర్యమో, వీర మరణమో, ప్రతిఘటనయో, మరొక బానిస యజమానిని నెత్తిపై కెక్కించుకొనటమో, యేదో ఒకటి మనం నిర్ణయించుకోవాలి.

మన దేశం యిదివర కెన్నడూ యిట్టి ప్రమాదావస్థలో పడలేదు. ఆకాశంనుండి అగ్ని వర్షాలను కురిపిస్తున్న శత్రువు మన గుమ్మం దగ్గరనే పొంచి యున్నాడు: ప్రజలు ఒక శతాబ్దంనుండి ఆయుధమంటే ఏమిటో ఎరుగని స్థితిలో వున్నారు. ప్రభుత్వమో, బాధ్యతా రహితంగా వ్యవహరిస్తోంది; పైగా ప్రజలను రక్షణ కార్యాలను భగ్నం చేసే వారినిగా తయారుజేస్తోంది. దేశ రక్షణకై ప్రజలను సన్నద్ధ పర్చుటకు, ఐక్యపర్చుటకు, ప్రధాన రాజకీయ సంస్థలు గావించిన ప్రయత్నాలన్నీ విఫలమైనాయి.

శత్రువుకింత కన్నమంచి అవకాశాలు ఏమికావాలి? ఆయుధాలు ఎంత తక్కువగా ఉన్నా, సంఘీభావంతో వున్న ఏ శత్రువూ జయించలేడు; ఏ ఆయుధమూ భేదించలేదు. ఐక్యత అనేకవచాన్ని మనం ఊడబెరుక్కుంటే, శత్రువు పనిని సగం జేసిపెట్టిన వాళ్ళమవుతాము.

ఇటువంటి క్లిష్టసమయంలో, ప్రతి యితరరాజకీయ పార్టీ కూడా దేశం యెడల తను కనీస ధర్మాన్ని నెరవేర్చ జాలక విఫలమైన పరిస్థితులలో, కమ్యూనిస్టు పార్టీ కార్యరంగంలోకి దూకుతోంది. జాతీయ ప్రభుత్వం కొరకు, దేశరక్షణ కొరకు, సంపూర్ణ జాతీయైక్యతను సాధించుటకు, కాంగ్రెసు నాయకులను విడిపించుటకు, నిరంకుశాధి కారుల వెఱ్ఱిమొఱ్ఱి చేష్టలవల్ల పతనమయ్యే ప్రజలనైతికశక్తిని నిర్మించుటకు, కమ్యూనిస్టు పార్టీ నడుంకట్టింది.

నవంబరు 1 వ తేదీన సాధింపబడు ఐక్యతా ఉద్యమం దేశంలోని మూడవ ప్రధాన రాజకీయశక్తి యైన కమ్యూనిస్టు పార్టీ శత్రువులకు జేసేసవాల్. నిరాయుధులగు అస్సాం, చిట్టగాంగు ప్రజలపై మృత్యు వర్షాన్ని వెదజల్లిన హంతకులకు సవాల్. కొద్ది కాలంలోనే ప్రజల ఐక్యతా బలంవల్ల జపాను హంతకుల ఆశలకు, సమాధులు కట్టిస్తామని భారతీయులు జపాను సామ్రాజ్యవాదులకు చేసే సవాల్. ఒక్క బ్రిటీషు సైన్యాల నెదుర్కొంటే చాలునని తలచే జపాను బందిపోటువొంగలకు, తమ పొరపాటును తెలుసుకోనేటట్లు చేసే 40 కోట్ల ఐక్య ప్రజల సవాల్.

ఇంతేకాదు: గృహచ్ఛిద్ర అనే నెపంమీద దేశమంతటా నిర్బంధ విధానాన్ని సాగిస్తున్న నిరంకుశాధికార వర్గమునకు కూడా యీ జాతీయైక్యతావారం సవాలుచేస్తోంది. కాంగ్రెసుపై దాడి సాగించినపుడు ముస్లిం ప్రజా సామాన్యం ముభావంగా వుంటుందని యీ నిరంకుశాధికార వర్గం ఆశించింది. కాంగ్రెసుకు, లీగుకు, మధ్యవున్న విభేదాల నాధారంగా గొని, అధికారం ప్రజల హస్తగతం చేయ నిరాకరించటానికి; ప్రజలపై దారుణ నిర్బంధ విధానాన్ని సాగించటానికి సాహసించారు వీరు. కాని త్వరలోనే కళ్ళు తెరువకపోరు. ఉద్యమం యొక్క మొదటి వారంలోనే కమ్యూనిస్టు పార్టీ వేలు, లక్షల యిండ్లకు వెళ్ళుతుంది. యే విధంగా కాంగ్రెసు నాయకుల అరెస్టు, దేశ రక్షణలనే స్థంభింప జేస్తున్నదో, యే విధంగా అది జపాను దాడికి ప్రజలను బలిజేస్తున్నదో, నిర్మొగమాటంగా, సూటిగా, ప్రజలకు తెలియబరుస్తుంది. లక్షలాది ముస్లిం ప్రజలకు కూడా యీ యదార్థాన్ని విశదీకరిస్తుంది. "జాతీయ ప్రభుత్వ స్థాపనకు, దేశ రక్షణకు, కాంగ్రెసు నాయకులను విడుదల చేయుండి" అని భూమ్యాకాశాల దద్దరిల్లేటట్లుగా వారిచే పల్కిస్తుంది. బిర్రబిగిసి కూర్చున్న నిరంకుశాధికార వర్గాన్ని ఐక్య ప్రజల శక్తికి లొంగునట్లు చేస్తుంది; ప్రజలకు ఐక్యతా బలంయొక్క ప్రభావాన్ని చవిచూపిస్తుంది; వారి బలముపై వారికి విశ్వాసం పుట్టిస్తుంది. జాతీయ ప్రభుత్వం, దేశరక్షణ, ఏ విధంగా సాధ్యమో చూపగల్గుతుంది.

ప్రజలలోని అనైక్యతయే నిరంకుశాధికార వర్గానికి మిగిలిన ఊతగఱ్ఱ. ఈ ఊతగఱ్ఱను పడగొట్టుటకు మనం తీసే దెబ్బలలో మొదటిది జాతీయైక్యతావారం, వజ్రాఘాతంవంటిది ఈ దెబ్బ.

ఇంతేకాదు: యే కారణంవల్ల నైతేనేం, ప్రజలు స్వాతంత్ర్య సంపాదన కొరకై ఐక్యం కాలేరంటూ నిరుత్సాహ వచనాలు పల్కే రాజకీయ నాయకులను కూడా, యీ ఐక్యతా వారం సవాల్ చేస్తుంది. పంచమాంగ దళంవారు, విద్రోహులు "మీరు ఐక్యం కాలేరు" అని ప్రజలలో శంకలు గలిగిస్తున్నారు. ద్వేషాగ్నివల్ల రాజకీయంగా అంధులైన దేశ భక్తులు వీరి వలలో బడుతున్నారు. ఐక్యతకై ప్రజలు గావించే ప్రతి కార్యానికి వీరు కుంటి వాదనలతో విఘ్నాలు గల్గిస్తున్నారు.

ప్రజాశక్తియందునమ్మకం లేని-ఇట్టి దాగియున్న విధ్వంసకులకు-ఐక్యతావుద్యమం ఒక సవాల్. ప్రజలు ఐక్యమవుతారని వారునమ్మరు కాని, కమ్యూనిస్టుల పిలుపుకు ఉత్సాహంతో ముందుకువచ్చే ప్రజలను చూచి వారు విభ్రమం జెందుతారు. జాతీయ వారం కమ్యూనిస్టుల 'స్టంటు' అంటారు. కాని స్వాతంత్రం కొరకు తహతహలాడే ప్రజల గాఢవాంఛయే ఐక్యతను కొనివస్తుందని వారు త్వరలోనే తెలుసుకుంటారు.

కమ్యూనిస్టు పార్టీకి ఈ ఐక్యతావారం ఒక మామూలు ఘటనకాదు. ప్రజలందరినీ ఐక్యపర్చుటకై ప్రారంభించే బ్రహ్మాండమగు పోరాటంలో యిది ప్రారంభదశ. దీని విజయంపైననే, మనం ఒకజాతిగా జీవించి ఉండగల్గటం, మన మాతృదేశం ప్రపంచలో తలయెత్తుకొని తిరగగటం, ఆధారపడివున్నాయి. జాతీయైక్యతకై కృషి చేయడమంటే మన జాతీయ స్వాతంత్ర్యం కొరకు, దేశరక్షణకు పోరుసల్పడ మన్నమాట. జాతీయైక్యతా వారమునకున్న ప్రాధాన్యత ఇదే. ఏ ఇతర రాజకీయ పార్టీ ఈ సత్యాన్ని గుర్తించలేదు. కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే గుర్తించి, దానికై పనిచేస్తోంది. కాబట్టి నేడు పార్టీపై ఎంతో బాధ్యత పడింది. పార్టీయొక్క జయాపజయముల మీదనే దేశభవిష్యత్తు యీ రోజున ఆధారపడియుంది.

ఈ ఐక్యతావారంలో కమ్యూనిస్టు పార్టీ, ప్రజలకు, తన పూర్తి పంథాను అనగా జాతీయ రక్షణ, జాతీయ ప్రభుత్వం, కాంగ్రెసు నాయకుల విడుదల, కాంగ్రెసు - లీగు ఐక్యత అనే నినాదాలను విశదీకరిస్తుంది; నిరంకుశాధికారుల నిర్బంధ విధానాన్ని ఖండిస్తుంది; జాతీయ రక్షణ కార్యాలను భగ్నపరచే విధ్వంసక చర్యలకు, అరాజక చర్యలకు వ్యతిరేకత తెల్పుతుంది; పంచమాంగదళ చర్యలను నిరసిస్తుంది; దేశ రక్షణను ప్రజల హస్తగతం చేసుకొనే విధంగా కాంగ్రెసు - లీగు యే విధంగా ప్రజలను సమీకరించ లేకపోయినదో తెల్పుతుంది; యెన్ని కష్టాలు వచ్చినా అన్ని విధాల ఫాసిస్టు హంతకుల్ని యెదిరించాలని హెచ్చరిస్తుంది; దేశాన్ని రక్షించుకొనుటకు జాతీయైక్యత ఒక్కటే సరియైన ఆయుధమని చెప్పుతుంది.

నేడు ప్రతి దేశ భక్తుని హృదయం ఐక్యతకై తపించిపోతుంది; 40 కోట్ల ప్రజల ఐక్యతయే మన వజ్రాయుధం; ఈ ఆయుధంతోనే స్వాతంత్ర్యం సంపాదించగలం; నిలబెట్టుకోగలం; ఈ విశ్వాసంతోనే పార్టీ యీ ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ వుద్యమం సంపూర్ణ విజయం పొందగలదని గాఢంగా విశ్వసిస్తోంది. దేశాన్ని నాశనం నుండి, బానిసత్వం నుండి రక్షించడానికి యిదే మార్గం; పార్టీ ప్రతి సభ్యుడు తనపై బడిన బాధ్యతను ఉచిత రీతిని నిర్వర్తించాలి; పార్టీని, దేశాన్ని రక్షించడంలో నడుం కట్టాలి.

జపాను బాంబుల వల్ల భారత దేశగ్రామాలు భస్మీపటల మౌతున్నాయని మీరందరు గుర్తించండి. భారతీయులు - పురుషులు, స్త్రీలు, వృద్ధులు, బాలురు అందరూ - జపాను విమానాలచే హత్యచేయబడు తున్నారు. మన ఐక్యతయే దెబ్బకుదెబ్బ; జపాను తోదేళ్ళకు బుద్ధి చెప్పేది ఇదే. ఐక్యతయే నిరంకుశాధి కారులు కల్పించే అడ్డంకుల్ని తొలగిస్తుంది; దేశరక్షణ కార్యాలను నిర్విఘ్నంగా సాగించగల అవకాశాన్ని కల్గిస్తుంది. ఇందుకై కమ్యూనిస్టుపార్టీ మార్గం చూపిస్తోంది; దేశాభి మానంగల ప్రతి భారతీయుడూ, శాంతినభిలషించే ప్రతి మానవుడూ, జాతీయైక్యతకై ఈ బాట ననుసరించండి!

—భారత కమ్యూనిస్టు పార్టీ.
(అంతర్జాతీయ పార్టీ శాఖ.)

ప్రజాశక్తి అభివృద్ధి

జిల్లా	నవంబరు దేకోటా	నవంబరు 15 పూర్తిచేసినది
విశాఖపట్టణం	200	124
తూ॥ గో॥	360	449
ప॥ గో॥	685	476
కృష్ణా	1745	1792
గుంటూరు	901	981
నెల్లూరు	709	611
చిత్తూరు	100	83
అనంతపూరు	100	35
కడప	100	55
కర్నూలు	100	115
ఇతర చోట్ల	....	629
మొత్తం	5000	5350

నాజీలకు సింహస్వప్నం
మార్షల్ టిమోషెంకో

కామ్రేడ్ నండూరి ప్రసాదరావు

'నావద్ద ఇంకా కొత్తసేనలు ఉన్నాయి; కానివాటిని దేశంలో శాంతి భద్రతలను కాపాడటానికి ఉంచదలచుకొన్నా!'

[1940 లో ఫ్రెంచి ఓటమికి ముందు ఫ్రెంచిసర్వసేనాని వేగాం.]

'ప్రపంచ యుద్ధాలలో ఎన్నడూ కని విని ఎరుగని అవమానకరమైన ఓటమికి కారణం, అసమర్థతకు తోడు ద్రోహం.......వర్గ స్వలాభాలవల్ల విప్లవానికి బదులు అతడు (వేగాం) జర్మన్ విజయాన్ని కోరుతున్నాడు.'

[ఫ్రెంచి సేనానులను గూర్చి లూయీలెవీ.]

'సోవియట్ సేనానులు మామూలు సైనికులలో నుండి వారి శక్తి సామర్థ్యాలవల్ల పైకివచ్చినవారు. అందువల్ల వారిలో పంచమాంగదళంవారు లేరు. ఇతర దేశాలలో ఓటమికి కారణమైన వర్గ స్వలాభాలు వారికి లేవు.'

[సోవియట్ సేనానుల గూర్చి పాట్స్లోన్.]

సోవియట్ - జర్మను యుద్ధంలో జర్మన్లపైకి ఎదురుదాడి సాగించిన మొట్టమొదటి సేనాని మార్షల్ టిమోషెంకో సామాన్య రైతు కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పుడు ఒక భూస్వామివద్ద పాలేరుగా పనిచేశాడు. ఇంతలో మొదటి ప్రపంచ యుద్ధం ఇతన్ని బలవంతంగా సైన్యంలోకి ఈడ్చుకుపోయింది. జారు సైనికుల పరిస్థితులెంత నికృష్టంగా ఉండేవంటే, వాటిని భరించలేక టిమోషెంకో ఒక సేనానిని చావచితుక గొట్టాడు. బోల్షివిక్ విప్లవం రాగానే ఈతడు అత్యుత్సాహంతో దానిలో జేరాడు. నలుప్రక్కల నుండి తోదేళ్ళ గుంపులవలె తన మాతృభూమిపైకి కోరలు చాచుకుంటూ వచ్చే శత్రు సైన్యాలను, దేశ ద్రోహులను దునుమాడుటకై గెరిల్లా దళంలో జేరాడు. ప్లటూను కమాండరుగా ప్రారంభించి తన చాకచక్యంవల్ల క్రమక్రమంగా రెజిమెంటుకు సేనాని అయ్యాడు.

జారిట్జను (నేటి స్టాలిన్‌గ్రాడ్) శత్రువులచే చుట్టుముట్టబడివున్నది. సంరక్షకులు పరిస్థితులను అధ్వాన్నం జేసివేశారు. పట్టణమే శత్రువులకు పట్టుబడితే దక్షిణ రంగమంతా వారి స్వాధీనమే అవుతుంది. ఆసమయంలో పట్టణ సంరక్షణ స్టాలిన్ చేతులలో పెట్టబడింది. పట్టణ కార్మికులతో బీదరైతులతో సైన్యాన్ని సృష్టించి స్టాలిన్ పట్టణాన్ని విషమావస్థనుండి తప్పించాడు. బయటినుండి టిమోషెంకో సైన్యాలు ముట్టడి సేనల్ని భేదించుకొని కోటకు చేరుకున్నాయి. ఉభయ సైన్యాలు కలిసి శత్రువుల్ని పటాపంచలు చేశాయి.

1920 లో రోస్టాప్ దేశద్రోహి 'రాంగెలు' చేతులలో పడ్డది. పట్టణం మిలిటరీ దృష్టిలో ప్రధానమైనది. విజయగర్వంతో 'విద్రోహి' సేనానులంతా పెద్ద విందు చేశారు. హటాత్తుగా విందుమధ్య టిమోషెంకో ప్రత్యక్షమైనాడు. 'విందు కానీయండి; తర్వాత చేతులెత్తి నిలబడండి' అని ధీర శాంతస్వరంతో ఆజ్ఞ యిచ్చాడు. [తిర్గి 1941 లో జర్మన్లచేతులలో రోస్టాప్ పడ్డది. రెండు పర్యాయములు టిమోషెంకో సేనలు రోస్టావును శత్రు విమోచనం గావించినాయి.] వెనువెంటనే క్రిమియాలో రాంగెలు సేనల్ని టిమోషెంకో, ఫ్రుంజీసేనలుకలిసి తీక్ష్ణంగా ఓడించాయి. టిమోషెంకో స్వయంగా యుద్ధరంగంలోపాల్గొని రెండుగాయాల్ని తిన్నాడుగాని రంగాన్ని మాత్రం విడిచిపెట్టలేదు. అంతః కలహాలు అంతరించి దేశంలోశాంతి ఏర్పడ్డ తర్వాత టిమోషెంకో మిలిటరీకాలేజీలో ఉన్నత విద్య నభ్యసించాడు. కాకేసస్సు,ఖార్కోవ్, కీవ్ ప్రాంతాల సైన్యాధ్యక్షతను వహిస్తూ 1940 మే నెలలో దేశరక్షణ మంత్రియైనాడు.

టిమోషెంకో నాయకత్వాన రెడ్‌ఆర్మీ అఖండ విజయాలను పొందింది. అజేయమని తలచబడిన హిట్లరు సైన్యాలు మొట్టమొదటగా టిమోషెంకో చేతుల్లోనే ఓటమిని చవిచూచాయి. జర్మను మిలిటరీ నిపుణుల తనిఖీ క్రింద కట్టబడిన, అభేద్యమని తలచబడిన, మానర్‌హీమ్ కోటలు (ఫిన్లాండులో) భేదింపబడ్డాయి. ఈతని సైన్యాలే సెప్టెంబరులో మాస్కో ముందు నాజీ సైన్యాలకు కొరకరాని కొయ్యలైనాయి. ఈతని సైన్యాలే గత శీతాకాలంలో, నీరు ఘనీభవించడంకన్న ఇంకా ఎక్కువ చలిలో ఖార్కోవ్ ప్రాంతాన అపూర్వమగు దాడుల్ని సాగించి నాజీ వ్యూహాల్ని తారుమారు చేశాయి. ఈతని సైన్యాలే నేడు స్టాలిన్‌గ్రాడ్ (1920 నాటి జారిట్జను) వద్ద లక్షలాది జర్మను సైన్యాలను ఆహుతి గొంటున్నాయి.

1939 లో యుద్ధం ప్రారంభంకాగానే సోవియట్ యూనియన్ కూడా ఈ సుడిగుండంలోకి ఈడ్వబడుతుందని సోవియట్ నాయకులు ఎరుగుదురు. కాబట్టి ఆంగ్లో-జర్మను యుద్ధం అనుభవాల్నిబట్టి రెడ్‌ఆర్మీకంతకూ కొత్త తర్ఫీదు ఇవ్వాలని నిశ్చయింపబడింది. టిమోషెంకో ఆ బాధ్యతను వహించాడు. ఆబాధ్యతనెట్లు జయప్రదంగా నిర్వహించాడో తర్వాత సోవియట్ విజయాలే తెల్పగలవు. టేబిలు ముందు కూర్చుని కాగితాలపై ఆజ్ఞలు జారీ చేయటంకాదు ఆతనిపని. రాత్రింబగళ్ళు సేనలతో కలిసిమెలిసివుండి, స్వయంగా వారికి సైన్య సంచాలనాన్ని గూర్చి ఉపన్యాసాలిచ్చేవాడు. చిన్నచిన్న సైన్యదళాలకే - ప్లటూను, కంపెనీ, బెటాలియనులకే - ఎక్కువ తర్ఫీదుయివ్వటానికి ప్రాధాన్యత నిచ్చాడు.

"కంపెనీ, బెటాలియను, రెజిమెంటులకిచ్చే తర్ఫీదు మీదనే సైన్యవ్యూహ నిర్మాణం ఆధారపడి వుంటుంది. ఈవిషయాన్ని బాగా గుర్తించాలి. గడియారం నడిచినట్లుగా మిక్కిలి నియమబద్ధంగా సైన్యంలో ప్రతి దళమూ పనిచేసినప్పుడే సైన్యం తర్ఫీదు పరిపూర్ణతను పొందగలదు.........మనం బాగా కష్టపడాలి. శాంతి సమయంలో ఖర్చుపెట్టిన శ్రమ యుద్ధకాలంలో వడ్డీతో సహా తిర్గి ముట్టుతుంది." టిమోషెంకో సైన్యనిర్మాణ పద్ధతి ఇది.

విషమపరీక్ష వచ్చింది. టిమోషెంకో సైన్యాలకు, నాజీ సైన్యాలు మహా ప్రళయంగా ముంచుకుంటూ మాస్కోను చుట్టుముట్టినాయి. గోబెల్సు ప్రగల్భాల ప్రకారం మాస్కో రోజుకు నాల్గుసార్లయినా నాజీ ముష్కరుల స్వాధీనం కావలసిందే. కాని వారు మాస్కో ప్రాకారాల్ని మాత్రమే చూడగలిగారు. హాయిగా మాస్కోలో చలికాలాన్ని వెళ్ళ గడుపదామనుకొన్న నాజీదొరలు స్మాలెన్స్కు దగ్గర అరణ్యవాసం చేస్తున్నారు.

స్టాలిన్‌గ్రాడ్ - టిమోషెంకో ఈ రెండు పేర్లు నేడు అబాల గోపాలంనోటా వినవస్తున్నాయి.

సోవియట్ స్త్రీలపాత్ర

జర్మన్లు సోవియటుయూనియన్ పై దాడిచేసినపుడు, ఒక శత్రుసైన్యంతోనే గాక ప్రజలందరితో ఢీకొనవలసి వచ్చింది.

"పురుషులు పనిచెయ్యాలి, స్త్రీలు ఏడుస్తూ కూర్చోవాలి" అనే సామెతకు రష్యన్ సాంప్రదాయంలో యెప్పుడూ స్థానం లేదు ప్రతివిషయంలో స్త్రీలు పురుషుల్తో సరిసమానంగా పరిగణించబడే ఆధునికరష్యాలో, దురాక్రమణదారులతో యుద్ధంలో, స్త్రీలు తమకు గూడా తమ వంతిమ్మని అడగటంలో ఆశ్చర్యం లేదు.

గెరిల్లా వుద్యమంలో స్త్రీలపాత్ర మూడువిధాలుగా వుంటుంది. (1) గెరిల్లాదళాల్లో చేరి పోరాడతారు. (2) స్కౌటుగానూ, వార్తావాహకులుగానూ, గూఢచార్లు గానూ పనిచేస్తారు. (3) ఆహారం సప్లయిచేస్తారు, గాయపడ్డవారికి ఉపచర్య చేస్తారు.

శత్రు వెనుకభాగంలో వున్న ఒక రెడ్‌ఆర్మీ పర్యవేక్షణ దళం ఇటీవల ఒక గెరిల్లాదళాన్ని కలుసుకుంది. సమిష్టి వ్యవసాయక్షేత్రంలో గుర్రపుజీనులు తయారుచేసే 16 సంవత్సరాల వృద్ధనాయకుడు తప్ప దళంలోని మిగతావారంతా స్త్రీలే.

స్త్రీలు రెడ్‌ఆర్మీకి శాయశక్తులా సాయపడడానికి నాజీల వెనుకభాగంలో వుండిపోయారు. మొదట వారిదృష్టి జర్మన్ మందుగనులున్న ప్రదేశాలపై కేంద్రీకరించారు. వాటిని గుర్తించే చిహ్నాలన్నీ తొలగించారు. అందువల్ల అనేక జర్మన్ కార్లూ, మోటారుసైక్లిస్టులూ వాళ్ళ స్వంత మందుగనులకే బలికావటం జరిగింది.

ఈ స్త్రీ గెరిల్లాలు ఎక్కడెక్కడ శత్రువు మందుగనులు నాటారో, రెడ్‌ఆర్మీ స్కౌట్లకు తెలియజేశారు. రహస్య అరణ్యమార్గాలగుండా వాళ్లు, రెడ్‌ఆర్మీ సైనికుల్ని, ఆరంగంలో జర్మన్ సైనిక సమీకరణకేంద్రాలకు, తీసుకుపోయారు. అందువల్ల రెడ్‌ఆర్మీ విజయవంతమైనదాడిని, తర్వాత చేయగల్గింది.

★ ★ ★

ఈ యుద్ధంలో కొన్ని సమయల్లో స్త్రీలే పురుషులకు నాయకత్వంవహిస్తారు. "క్రాస్నీపహార్" అనే సమిష్టి వ్యవసాయ క్షేత్ర బోర్డు సభ్యురాలైన డి. మేరియాచే నడపబడుతూన్న గెరిల్లా దళమొకటుంది.

ఈ దళం అనేక బావులను మట్టితో పూడ్చింది. ముఖ్యమైన వంతెన్లను నాశనంచేసింది. తంతితీగల తెగగొట్టింది. ఒక సమయంలో వాళ్లు నలుగురు జర్మన్ వార్తావాహకులను పట్టుకున్నారు. టాంకులకు స్పేర్‌పార్టులు మోసుకుపోయే నాజీ మోటారుదళం రాత్రికి ఆమార్గాన పోతుందని వాళ్ళవల్ల తెలుసుకున్నారు. వెంటనే మాటు పన్నివుంచారు.

తెల్లవారుజామున యిరుకైన అడవిరాస్తాలో జర్మన్ దళాన్నెదుర్కొన్నారు. 8 మోటార్లు నాశనం చేశారు. టాంకు సామాసులను విరగగొట్టి బురదలో పారవేశారు.

★ ★ ★

బైలో రష్యాలో, స్థానిక కాంసోమాల్ సంస్థ (యువక కమ్యూనిస్టు సంఘం) కార్యదర్శినియైన "అన్నా షుబ్యోనిక్" అనే యువతి, యుద్ధారంభంనుండి గెరిల్లాదళంలో వుండి పోరాడుతోంది. ఒక సంఘటనలో తీవ్రమైన కాల్పులగుండా ఆమె శత్రు పెట్రోల్ డిపో దగ్గరకుప్రాకిపోయి, గాయపడినా లక్ష్యపెట్టక, చేతిబాంబులు విసిరి పెట్రోల్ తగలబెట్టింది.

★ ★ ★

ఒక వృద్ధ కర్షక స్త్రీ గాథ తెలుసుకుందాం. ఆమెమనుమరాలు గెరిల్లా దళంలో చేరింది. ఆరంగంలో జర్మన్ట్రాంకుల చర్యలగురించిన సమాచారం కావలసివచ్చింది. శత్రుఆక్రమిత గ్రామంలో వుండిపోయిన ఆ వృద్ధ స్త్రీ సహాయానికి పూనుకుంది. కాని ఒకచిక్కు వచ్చింది. జారుకాలంలో పుట్టి పెరిగిన ముదుసలి కావటంవల్ల, చదువు సంధ్యలేవు. అంకెలు లెక్కించటం తెలియదు. బటానీలు, చిక్కుడుగింజలు ఉపయోగించవచ్చనే ఆలోచన ఆమెకు తట్టింది. బటానీలు చిన్న టాంకులకూ, చిక్కుడు గింజలు పెద్ద టాంకులకూ ఉపయోగించాలనుకుంది. జర్మన్ టాంకులు గ్రామంగుండా పోతూ బటానీ గుండ్లను విసిరివేస్తున్న వృద్ధ వనితను మాత్రమే చూడగలిగారు. కాని ఆ సాయంకాలం గెరిల్లాదళానికి జర్మన్ బలాలనుగూర్చిన పూర్తి వివరాలు చేరాయి. (4 వ కాలంలో)

ఈ వార్తలు రెడ్‌ఆర్మీ యూనిట్‌కు చేరడంతో శత్రు టాంకు దళాన్ని ఓడించుట కవసరమైనబలం సరిగాఅంచనా వేసుకోగలిగారు రెడ్‌ఆర్మీ గ్రామాన్ని ప్రవేశించినప్పుడు వృద్ధవనిత "అనిస్యా," ఆమె మనుమరాలు "ఉల్యా" వుభయులూ సేనాధిపతిచే ప్రశంశించబడ్డారు.

(అచ్చులోనున్న "గెరిల్లా" అనే గ్రంథంనుండి)

వాస్తవికగాథ

సోవియట్ ఫిరంగివీరులు

యుజెనీ వొరోబ్యావ్

నేను తరచుగా యుద్ధరంగాన్ని చూచివస్తూ వుండేవాడిని ఆ సమయాల్లో కామ్రేడ్ మేజర్ వాల్లాసోవ్ ఫిరంగిదళం వీరులతో గాఢపరిచయం ఏర్పడింది. వారు చెప్పిన వీరగాథలు వినగా గల్గిన పరవశత్వమే ఈ కథలరూపంపొందినది.

ట్రేడ్‌మార్కు

మనిషికి గడ్డంఅనేది కొంత ఘనతను, గౌరవాన్ని ఆపాదిస్తుంది. పైగాకొంత వయోధిక్యతను కూడా కల్పింప జేస్తుంది. కానిమేజర్ వాల్లాసోవ్‌ను, దుబ్బుగా పెరిగిన అతని గడ్డాన్ని చూస్తే, ఆ లేతమొగానికి, తళతళ మెరిసే కళ్ళకు, ఆ గడ్డానికి ఎక్కడా అతకలేదు. నేనడిగా 'యుద్ధరంగంలోని సరికొత్తఫాషనా, లేక, యుద్ధరంగంలో 'అందచందాలు ఎవరు చూడవచ్చారు అనా ఆ గడ్డం పెంచటం.'

'అదీకాదు, ఇదీకాదు. దానికి చాలా పెద్ద గాథఉంది' అన్నాడు వాల్లాసోవ్. కథ సొంపుగా ఉంటుందని గడ్డమే చెప్పుతోంది కాబట్టి నేను కథ చెప్పమని బలవంతంచేశా.

కామ్రేడ్ మేజరు కథ మొదలెట్టాడు, 'గడ్డంపుట్టిన రోజుకి మాదళం పెద్దబయలులో వుంది. మాసామానంతా-నా క్షౌర పరికరాలతో సహా- వెనకనుండి వచ్చే రైలుపెట్టెలో ఉండిపోయింది. రోజులు, వారాలు గడిచినాయి కాని సామానుబండి రాలేదు. ఏం పెట్టి ఈ చిట్టడివిని ఛేదించను?

ఒక రోజున జర్మను గస్తీవాళ్ళు నన్ను చూచారు. మరునాడు ఒక మేగాఫోనులో ఇట్లా అరిచారు ఓయ్‌గడ్డం, నీ ఫిరంగుల్ని తీసుకుని తోక ముడతెడతావా, లేక, మీ తాతముత్తాతల దగ్గరికి పంపమంటావా' 'మా ఫిరంగుల కాక తగిలిందన్నమాట ఈ కుక్కలకు' 'అన్నాడు పక్కనేఉన్న గన్నరు.

నాల్గురోజులు గడిచినతర్వాత మాసామాను వచ్చింది. నా కొత్త అలంకారానికి తిలోదకా లియ్యడానికి రేజరుతో అద్దంముందు నిలిచాను. రెండుగీట్లతో నాబరువు ఒదిలిపోయేదే కాని..........

చటుక్కున గుర్తువచ్చింది. జర్మన్లకు భయపడి గడ్డాన్ని గొరిగాడని మాదళంవాళ్ళు అనుకుంటే!

పుట్టెమునిగిపోయేదే జాగ్రత్తగా రేజరును యథాస్థానంలో ఉంచి గడ్డాన్ని ఒక్కమాటు నిమురుకున్నాడు. ఇది ఇంక నాగడ్డంకాదు; మా దళంయొక్క ట్రేడ్‌మార్కు.

సినిమాకి

జర్మన్లు మారినోగ్రామంలో తమ సోల్జర్లకు సినిమా చూపించబోతున్నారని వార్తవచ్చింది. సమిష్టి వ్యవసాయ క్షేత్రం యొక్క పశువుల పాకలో రాత్రి 10 గంటలకు ఆట ప్రారంభం. కామ్రేడ్ మేజర్ నెస్టిరోవ్ వెంటనే ఫిరంగి దళానికి టెలిఫోను చేశాడు.

'వేటకు మీరు సిద్ధంగాఉన్నారా?'

'ఓ సిద్ధం. టంగున పది కొట్టేసరికి మేము వేటను ప్రారంభిస్తాము.'

'మరెవరైనా పెద్దన్నయ్యలు ఆలస్యంగా వస్తారేమో.'

'మరేం ఫరవాలేదు; అందరూ ముందుగానే ముస్తాబై వస్తారు!'

ఏమో! కొంతమంది సోక్కుతూ, సోలుతూ వచ్చేసరికి ఆలస్యంకావచ్చు. వాళ్ళు రాకుండానే వేట ప్రారంభమౌతే మజా ఉండదేమో. పోనీ, ఇంకొక 20 నిముషాలు ఆగి మొదలెడదాము.'

10 గంటలకు పాకలో ఆట ప్రారంభం. జర్మన్ సోల్జర్లు ఇసుక వేసినా రాలనంతగా కిక్కిరిసి ఉన్నారు. 10-20 అయింది: ధాం....ధాం.... ఒకటి, రెండు ......

రెండో గుండు సరిగ్గా పాకమీద పడ్డది. తోసుకుంటూ, తొక్కుకుంటూ బయటకు వచ్చిన సినిమా పిచ్చోళ్ళు రవ్వల గుండ్లకు బలి యైనారు.

మూడో గుండు పేలీ పేలగానే మేజరు కందకంలో టెలిఫోను మ్రోగింది. ఫిరంగిని పేల్చే కామ్రేడ్ పిలుస్తున్నాడు. "వేట అయిపోయింది, కామ్రేడ్ మేజర్!"

కారపు బుక్కాయి

ఫిరంగి దళపు వంట డిపార్టుమెంటు మేనేజరు కామ్రేడ్ సవిఛెవ్ పులుసును కలియబెడుతున్నాడు. ఎడం చేయి మెడకు వేళ్ళాడదీయబడియున్నది. జర్మన్లతో చేతులు చేతులు కలిపాడనీ, ఫలితం ఆసుపత్రి దర్శనమనీ నాకు తెలుసు. కాని వివరాలు తెలుసుకుందామని బయలుదేరాను.

"అంతా కారంవల్ల వచ్చిన పేచీ" అని మొదలుపెట్టాడు ఆ పాక శాస్త్ర కళా ప్రవీణుడు. "నేను పులుసులోకి కారం తీసుకువెళ్లతూవుంటే కాలు జారి చతికిల బడ్డాను. కారమంతా మట్టిపాలైంది; మళ్ళీ పులుసులోకి వేద్దామంటే డబ్బా ఖాళీ; యేం చెయ్యను? కారంలేని చప్పిడి పులుసు పొయ్యనా నక నక లాడుతూ వచ్చే కామ్రేడ్సుకి?

దగ్గిరలోనే ఒక గ్రామం వుంది. కామ్రేడ్సు వచ్చేలోపుగా ఆ వూరు వెళ్ళి కారం తేవచ్చునని బయలుదేరాను. కావలసిన కారం తీసికొని వెనక్కు మళ్ళానో లేదో, ఒక పొద చాటునుండి యిద్దరు జర్మను సోల్జర్లు నామీద పడ్డారు. ఛటాలున నా చేతిలో కారపు గుండను వాళ్ళ కళ్ళల్లోకొట్టాను. శాస్తి అయింది కుక్కలకు. వాళ్ళు శావనార్థాలెడుతూ కళ్ళు నులుపుకుంటూ వుండగానే నా రైఫిలును తీసి మడమతో రెండు పుంజీలు వాళ్ళ బుర్రలమీద వడ్డించాను. ఒకడు బుర్రపగిలి గిలగిల కొట్టుకుంటున్నాడు; కానీ రెండోవాడు సందు చూసుకొని సన్నీతో నా భుజంమీద పొడిచాడు.

నేను చప్పున జేబు రుమాలుతో కట్టు కట్టుకొని వాళ్ళ దగ్గరి పిస్తోళ్ళు లాక్కొని కాంపు దోవ పట్టాను, నాలు గడుగులు వేయగానే కారం అంతా అయిపోయిన మాట గుర్తుకు వచ్చింది. దేవుడా అంటూ మళ్లీ వూళ్ళోకి బయలుదేరాను.

"అవ్వా! నీ విచ్చిన కారం నేనే అవజేశా. పులుసు, కూరలు వండుకుంటానికి మళ్ళీ నీవిస్తేనే గతి" అనిజరిగిన సంగతంతాచెప్పాను. "నా కొడుకులు, బలే శాస్తి జరిగింది" అనుకుంటూ మరి కాస్త కారాన్ని పొట్లం కట్టియిచ్చింది అవ్వ.

ఆనాడు వంట పొద్దుపోయింది; అయితేనేం, మావాళ్ళు పొట్టలు బద్దలయ్యేటట్లు తింటున్నారు నా కథ వింటూ.

ప్రాణం గల టెలిఫోను తీగ

అవి శీతాకాలం! చలికి ఎముకలుకొరుక్కుపోతూ వున్నాయి. అయినా ఫిరంగిదళం టెలిఫోను ఆపరేటరు రోజల్లా గుండ్లదెబ్బలకు తెగిపోయే టెలిఫోను తీగల్ని బాగుచేస్తూవున్నాడు. ఎక్కడా నిలుస్తానికి కూడా తీరికలేదు.

చీకటి పడుతూవుంది. అటూయిటూ గుండ్లు ధాం, ధాం అంటూనే ఉన్నాయి. ఇంతలో ఎక్కడో టుప్పున తంతి తెగిపోయింది. టెలిఫోన్ మూగదైపోయింది. టెలిఫోను పని చేయకపోవడమంటే ఫిరంగిదళానికి కాళ్ళూ చేతులూ చల్లబడ్డాయన్నమాట. ఆపరేటరు ఉట్యుషిన్ చేతిలోనున్న రిసీవరును తన అసిస్టెంటుకు ఇచ్చి బయటకు బయలుదేరాడు. చీకట్లో తడుముకొంటూ తీగను పట్టుకొని ముందుకు పోసాగాడు.

మంచులో దిగబడిపోతున్నాడు -బాంబులు. ఫిరంగిగుళ్లు రంయ్, రంయ్ మంటూ నెత్తి మీదుగా పోతున్నాయి. వాటి పేలుడుకి భూమి అదిరిపోతుంది. చెవులు గడియలు పడిపోతున్నాయి: అయినా ముందుకు సాగుతూనే వున్నాడు. చివరకు తంతి తెగిపోయిన చోటికి చేరుకున్నాడు.

చీకటి బాగా పడ్డది. కన్ను, మిన్ను కానుపించుటలేదు; చలి చంపేస్తోంది. అయినా యివేవీ కామ్రేడు దృష్టిలో లేవు: వెంటనే తీగల్ని అతికించాలి. ఇదే అతని లక్ష్యం; ఏదో ఒక విధంగా రెండు తీగల్ని ముడిపెట్టాలి కాని జుట్లు జుట్లు ముడిపెట్టటం సులభమే గాని యుద్ధ రంగంలో, మారణ హోమం మధ్య తంతి తీగల్ని ముడిపెట్టడం - అబ్బా, తలుచుకుంటేనే ఒళ్లు కంపించిపోతోంది!

తీగల్ని ముడిపెట్టటం తేలికే కాని రెండూ దగ్గరకు చేరవద్దూ? ఏ ఫిరంగి గుండో గజం తీగ ముక్కని యెగరగొట్టేసుకు పోయింది.

ఉట్యుషిన్ వెంటనే జేబుతడిమాడు ఎప్పుడూ కోటుజేబులో కొంత తీగచుట్టను వేసుకు వుంచేవాడు. కాని ఖర్మంకొద్దీ ఆతీగెచుట్ట జేబులోలేదు. పంట్లముజేబు లన్నీ వెతికాడు; లేదు. ఒక్కగజం తీగముక్క, ఒక్కగజం.... ఒక్కగజంతీగముక్కపైననే ఆచోట పోరాటం గతి నిర్ణయింప బడుతుంది. ఆ ఒక్క గజం ముక్కకోసం—ఏమిఇవ్వడు!

టెలిఫోన్ మార్గాన్ని సరిజేయటానికిఒక్కటే మార్గం మిగిలింది. కామ్రేడ్ ఆ మార్గాన్ని అనుసరించాడు.

మానవశరీరం ఎలక్ట్రిసిటీకి మంచి కండక్టరు. సోవియటు ఫిరంగిదళం టెలిఫోన్ ఆపరేటరు కామ్రేడ్ ఉట్యుషిన్ యుద్ధరంగంలో, ఫిరంగిగుండ్లమధ్య ఒంటరిగా, చలిలో, నిశాసమయాన చేతివూలు తొడుగులు విప్పేసి రెండు తీగలూ పట్టుకొని నిలబడ్డాడు....

మరునాడు ఫిరంగిదళం జర్మన్లను 6 మైళ్లు వెనక్కు తరిమేసింది.

విజయకంకణానికి కార్మికవీరుల అఖండత్యాగం

ప్రపంచప్రజలు తమ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకై నేడు గావిస్తున్న ప్రజాయుద్ధంలో విజయంకొరకు పోరాడేది సైనికులుమాత్రమే కాదు. ఆ సైనికుల కాహారపదార్థాలు సప్లయి చేసే కార్మికవర్గం కూడా విజయంకొరకు పోరాడేవారే. నేడు సోవియట్‌రష్యాలో కార్మికులు తమ మాతృదేశ రక్షణకై గావించే అపూర్వకృషి ప్రపంచకార్మికులందరికీ ఆదర్శంగా వుంది.

సోవియటు సైనికుల కాయుధాలు సప్లయి చేసే బ్రహ్మాండమైన కర్మాగారాలు శత్రువుల వశమయ్యే ప్రమాదం కనబడినప్పుడు, సోవియటు కార్మికులు వెంటనే ఆ కర్మాగారాలను, యంత్రాయాలలను, తూర్పు ప్రాంతాలకుతీసుకుపోతారు. డ్నీపర్ పెట్రోవ్‌స్కలోని బ్రహ్మాండమైన ఉక్కుపరిశ్రమాలయం కీవ్ - ఒడెస్సాలలో వుండే ఇంజనీరింగు పరిశ్రమలు, ఖార్కోవ్ లోనడుపబడే ఎలెక్ట్రికల్‌వర్కుల్సు, ట్రాక్టర్లు, టాంకులు తయారుచేసేఉత్పత్తికేంద్రాలు, నాజీల చేతులలో పడకుండా ఊరల్ పర్వతాలకు, సైబీరియా ప్రాంతాలకు, రవానా చేయబడ్డాయి. కొన్నివేల టన్నుల బరువుగల ప్రతి రోలింగ్‌మిల్లు, ఎలెక్ట్రిక్ టర్బైన్, రైల్వేవేగన్లలోను, నదులపైన, రోడ్లమీద, దూరదేశాలకు రవాణా చేయబడ్డాయంటే, మన కెంతైనా ఆశ్చర్యం కలుగుతుంది. కాని, యిదంతా ముందుగా వేయబడిన ఒక ప్లాన్ ప్రకారం జరుగుతోంది. అప్పటికప్పుడు తొందరగా ఒక యంత్రాగారాన్ని మరొకచోటికి తీసుకుపోయిఅక్కడ దాన్నితిరిగి నిర్మించడం సాధ్యపడదు. అలాచేస్తే, ప్రతియంత్రానికి కావలసిన వేర్వేరుభాగాలు, తుంచ తప్పకుండా, ఆ యంత్రంతో వెళ్ళడం అసంభవం. రెండోవిషయం, ఆ యంత్రాగారాన్ని నడుపవలసిన నిపుణులు దానితోకూడా ఉంటే ఉండవచ్చు; లేకపోతే ఆ తొందరలో మరెక్కడికైనా పోవచ్చు. కొత్తస్థలంలో ఆ యంత్రాగారాన్ని నిర్మించాలంటే దాని కవసరమైన బిల్డింగులు, విద్యుచ్ఛక్తి, ముడిసరకు, సిద్ధంగా వుండకపోవచ్చు. మరొక విషయం, రోడ్లమీద ఇంత సామగ్రి వెళుతూంటే ఆటంకాలెన్నో వుండవచ్చు. నేడు సోవియటురష్యాలో యిలాటి చిక్కులేమీ లేవు. కారణం ఈ యంత్రాగారాలన్నీ మరొకచోటికి చటుక్కున రవాణా చేయడాని కనుకూలంగా మొట్టమొదటే నిర్మించుకున్నారు. ప్రతి యంత్రంలో వుండే భాగాలకు నెంబర్లు వుంటాయి. ఏ కార్మికుడు తన యంత్రాన్ని విడిచిపెట్టి వెళ్లడు. రైలు, రైల్వేయింజను, ఏమాదిరిగా విడిపోవో, అదేమాదిరిగా సోవియటు కార్మికుడు, తన యంత్రాన్ని ఎప్పుడూ విడిచిపెట్టడు. ఏ యంత్రాగారం ఎచటికి రవాణాచేయాలో అక్కడ విద్యుచ్ఛక్తి, ముడిసరకు, వగైరా తప్పక ఉండేటట్లు ముందే చూచుకుంటారు. వీటన్నిటికీ తోడు, స్థానికప్రజల సహకారం పూర్తిగా వుంటుంది.

ఇందువల్లనే డ్నీపర్ పెట్రోవ్‌స్కలో ఉండే వొరోషిలోవ్ ఫ్యాక్టరీ 1941 సెప్టెంబరు ఆఖరువారంలో ప్రయాణం మొదలెట్టి, అక్టోబరు 11వ తేదీ నాటికి మామూలుపని ప్రారంభించ గలిగింది. ఇందువల్లనే ఖార్కోవ్ నుంచి క్యుబిషేవ్‌కు తీసుకురాబడిన యంత్రపరిశ్రమలు, కొద్దివారాల (మిగతా 10వ పేజీలో)

స్టాలిన్‌గ్రాడ్ వీరుల అడుగుజాడలనే ఐక్యతకు - విజయానికి నడవండి!

కమ్యూనిస్టు పార్టీ పిలుపు

ఈనాడు ప్రపంచాన్నంతా మ్రింగజూస్తున్న దుష్టఫాసిస్టు శక్తుల్ని అష్టకష్టాల నడుమ, అధికృతగల సాహసంతో ఎదిరిస్తున్న సోవియట్ వీరప్రజలను 25వ నవంబరు విప్లవదినోత్సవమున మేము అభినందిస్తున్నాము; అపూర్వము, అశ్రుతము నగు వీరకృత్యాలను గావిస్తున్న ఎర్రసైన్యాలను, నావికాదళాన్ని, విమానదళాన్ని, గెరిల్లాదళాన్ని మేము అభినందిస్తున్నాము. తమ ఇళ్లివాకిళ్ళను, దేశాన్ని, స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకొనుటకై సోవియట్‌జాతుల నన్నిటినీ ఐక్యప్రజలనుగా సంఘటితపర్చిన కామ్రేడ్ స్టాలినును మేము అభినందిస్తున్నాము.

జాతీయంగాను. సాంఘికంగాను గావింపబడే దోపిడీవిధానానికి నవంబరు విప్లవం గొడ్డలిపెట్టు. ప్రపంచాన్నంతటిని దాస్యము నుండి విముక్తి పొందించుటకు, దోపిడినుండి తప్పించుటకునాందిప్రస్తావన నవంబరు విప్లవం.

స్వాతంత్ర్యంకొరకై ఎన్నడూ జరుగని మహా ఘోర యుద్ధం మధ్య నవంబరు విప్లవ రజితోత్సవం జరుగుతూ వున్నది. 20 సం॥లు యుద్ధం అంటే, ఆకలిబాధ అంటే, దోపిడి అంటే ఎరుగకుండా స్వేచ్ఛా, సౌఖ్యతరంగాల నోలలాడిన సోవియటు ప్రజలు తిరిగి తమ మాతృ దేశ స్వాతంత్ర్య రక్షణార్థం ఆయుధాలు చేతబట్టారు. 1917 లో వలెనే తిర్గి ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యాన్ని, భవిష్యత్తును సంరక్షింప యుద్ధరంగంలో ప్రవేశించారు.

ఒక 15 నెలల క్రితమే అన్నిచోట్ల ఫాసిస్టుకిరాతులు జయపరంపరలు గొంటున్నారు ప్రపంచ ప్రజాస్వామ్యము నాశనమౌతోందనిపించింది. ప్రపంచాధిపత్యానికై ఫాసిస్టు కుక్కలు జొరపడటానికి వాకిలి తెరవబడివున్నట్లగుపించింది. ప్రపంచమందలి ప్రతి దేశమూ ఫాసిస్టు దురాక్రమణకు లోనయ్యేటట్లు ఉన్నది. ఇంగ్లండు, అమెరికా, ఇండియా, చైనా అన్నిదేశాలపైన ఫాసిస్టు దాడి ఛాయలు పడుతూ వున్నాయి.

ప్రపంచప్రజల స్వాతంత్ర్యమే చావు బతుకుల మధ్య వున్నది. ఫాసిజాన్ని రూపుమాపటం ద్వారానే ప్రపంచ ప్రజల స్వాతంత్రం రక్షింపగలదు. ఈ బాట నెవరుచూపారు? స్వాతంత్ర్య జ్యోతి నెవరు వెలిగించారు? ఫాసిస్టు ప్రళయానికిచెలియలికట్టగా నిల్చిన మహాశక్తి ఏది?

రెడ్ఆర్మీ వీరులు, సోవియట్ ప్రజలు.

15 నెలలు వారు ఈ ఫాసిస్టు దావాగ్నిని ఎదుర్కొంటూవచ్చారు; మృత్యువును లెక్కచేయలేదు. శత్రువుకు అర్థ అంగబలాల ఆధిక్యతవున్నా ఏకాకిగా రొమ్ములువిరిచి నిలిచారు. మృత్యువు కెదురుగా తొడ చరిచి నిలిచారు.

అసంఖ్యాకమగు సాహసకృత్యాలు చేశారు; యుద్ధ నిపుణులందరూ నివ్వెరబోవునట్లు సైన్య సంచలనం చూపారు. రక్షణ అసాధ్యమనుకున్న పట్టణాలను సంరక్షించారు. అజేయమని తలచబడ్డ జర్మను సైన్యాల్ని నుగ్గునూచక్రింద కొట్టారు, జర్మను అక్షౌహిణులను, ఫాసిస్టు దురాశలను వాల్గానదిగట్టున భూస్థాపితంచేశారు.

సోవియట్ ప్రజలు, రెడ్ ఆర్మీ [illegible] చేసింది [illegible] స్వాతంత్ర్య [illegible] జాతీ [illegible] పట్టి [illegible]

నాకి [illegible] ప్రపంచ [illegible] స్వాతం త్ర్య [illegible] స్టాలిన్‌గ్రాడ్ [illegible] దేశం ఇంకా [illegible] మిగిలింది?

15 నెలలు సోవియటు ప్రజలు [illegible] అత్యాచారాలవల్లనే [illegible]

వెలుగుతూ వున్నది: ఫాసిస్టు ప్రగల్భాల నోళ్లు మూతలు పడ్డాయి; ప్రజలింకా స్వేచ్ఛావాయువును పీలుస్తున్నారు. పైగా ప్రపంచ స్వాతంత్ర్య విరోధి, ప్రజా స్వామ్య విరోధి, యుద్ధాధిదేవత అంతిమ ఘడియలు సమీపిస్తున్నాయి.

అజేయమగు సోవియట్ యూనియన్ ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యాన్ని సంరక్షిస్తోంది; ప్రతి దేశమందలి ప్రజలను నాజీలనుండి ఆత్మరక్షణ చేసుకోమని హెచ్చరిస్తోంది; ప్రపంచ ప్రజ లందరు యేకమై ఫాసిస్టు శక్తుల్ని నాశనంగావించమని హెచ్చరిస్తోంది. ఫాసిస్టు కూటమిని నాశనం చేయటంద్వారా సంపూర్ణ స్వాతంత్ర్యానికి, స్వేచ్ఛకు సాగండని పిలుస్తోంది. స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను, శాంతిని కోరే ప్రతి పౌరుని ఫాసిజాన్ని నిర్మూలించడానికి తనతో కూడి రమ్మంటున్నంది.

సోవియటు ఆహ్వానంపై ప్రపంచ ప్రజలందరూ ఫాసిజాన్ని తుదముట్టించ ఆఖరు దెబ్బ కొట్టనున్నారు. సోవియటు ప్రజలు, రెడ్ ఆర్మీ [illegible] ప్రజల [illegible] యూరపు, [illegible] అమెరికా, [illegible] దేశాల [illegible] ఫాసిస్టు [illegible] అంత్యాన్ని [illegible] స్వాతంత్ర్యాన్ని [illegible] స్తున్నారు. ఫాసిస్టు [illegible] అంటే స్వాతంత్ర్యం అని, ప్రపంచాన్ని [illegible] వేసిన [illegible] విజయంలో [illegible] ప్రపంచ; ఎందువల్లనంటే సోవియటు ప్రజలు తమ [illegible] వున్నారు; పైగా తమ శక్తిని తాము గుర్తించారు.

కొందరు రాజకీయజ్ఞులు, అధికారులు రెండవ రంగాన్ని [illegible] జంకుతూ వుంటే, మరికొంతమంది సోవియటు సహాయాన్ని పంపుటనే [illegible] రెడ్ ఆర్మీపై బరువును [illegible] కొనకుండా [illegible] వుంటే. ప్రపంచ ప్రజలు అమెరికా, [illegible] కార్మిక వర్గం రెండవ రంగాన్ని ప్రారంభించాలనీ, ఫాసిజానికి ఆఖరి చావుదెబ్బ కొట్టాలనీ అంతకంతకూ ఆందోళన అధికం చేస్తున్నారు. వారి ప్రభుత్వాధికారులు చెప్పే [illegible] జవాబులకు సంతృప్తి పడుటలేదు. కప్పదాటుల్ని సహించటం లేదు. సర్వ శక్తులతో అగ్నిగుండంలోకి దూకాలని హెచ్చరిస్తున్నారు.

నిరంకుశాధికారుల్ని, ఘుతవాదుల్ని లెక్క జేయకుండా ప్రజలు అంతకంతకు సోవియటు యూనియనే తమకు ముక్తిదాత యని, ఫాసిస్టు పిశాచాన్నుండి రక్షించగలదనీ యెదురు జూస్తున్నారు, అది భస్మీపటలం అవుతుంటే యెంత మాత్రమూ చూస్తూ వూరుకోరు.

ఈ విధంగా ప్రాక్పశ్చిమ ఖండాల ప్రజలందరూ యేకమవుతూవుంటే, ఫాసిస్టు శక్తుల కెదురుగా రొమ్ములు విరిచి నిలబడుతూవుంటే భారత దేశం స్థాన మేమిటి? ఏమి చేస్తూ వుంది? అతి సాహసంతో తన సరిహద్దులను సోవియటు వీరులు సంరక్షిస్తూవుంటే, భారత దేశానికి యేమీ పట్టలేదా? ప్రపంచాన్నంతా స్వాహాజేసి, బానిసత్వంలో ముంచి, స్మశాన భూమిగా జేయ గుమ్మందగ్గరనే ఫాసిస్టు భూతం నిలబడినప్పుడే భారత దేశానికి ఆపూనే అక్కరలేదా: ఒక యజమానినివదలి, మరొక యజమాని పాదాల నాశ్రయించటమేనా భారతీయుల గతి?

భారత దేశీయుల ధర్మం స్పష్టమే: ప్రపంచ ప్రజ లందరితోనూ గలిసి స్వాతంత్ర్యం సంపాదించు కొనుటా, లేక ఫాసిస్టు క్రూరుల చెప్పుల క్రింద బడి నలుగుటా?

ఫాసిస్టు పిశాచాన్ని వదలించుకోటానికైన ఈ యుద్ధంలో పాల్గొనుటవల్లనే, జర్మనీ - జపాను దుష్ట కూటమిని ఓడించటంవల్లనే సోవియటు, చైనా వీరులతో చేతులు చేతులు కలిపి పోరాడటంవల్లనే భారత దేశం తన స్వాతంత్ర్యాన్ని తాను సంపాదించుకోగలదు. కాని యిప్పుడు యేమి జరుగుతోంది!?



నిరంకుశాధికారులు అధికారాన్ని జారవిడువకుండా బిర్రబిగిసికూర్చొనుటవల్ల, నిర్బంధవిధానాన్ని అవలంబించుటవల్ల ప్రజలందరూ క్రోధావేశులై స్వాతంత్ర్య సంపాదనకై ఏమిచేయాలో దానికి పూర్తిగా వ్యతిరేకమైన దానినే చేస్తున్నారు. దేశరక్షణలను వదలివేశారు; ఫాసిస్టు ఉపద్రవాన్ని మర్చిపోయారు; తమ, సరిహద్దులను కాపాడుతూవున్న సోవియట్ చైనాలను మర్చిపోయారు. తమ దేశం నేడో రేపో యుద్ధమనే కార్చిచ్చుచే దహించబడుతుందన్న సంగతినివిస్మరించారు. మాతృభూమి రక్షణలను చేతకాని నిరంకుశాధికారవర్గం చేతుల్లో అప్పజెప్పి కూర్చున్నారు. మంచిచెడ్డ లరయకుండా, దేశభక్తియను గ్రుడ్డి ద్వేషాగ్నితో వారు ప్రపంచ ప్రజలకు దూరమౌతున్నారు. క్రమేణా స్వాతంత్ర్య వినాశనకారియైన ఫాసిస్టు కూటమి ఒడిలోనికి జారుతున్నారు.

మనగతి ఇదేనా? మన భవిష్యత్తు కోరేది ఈమార్గమేనా? ప్రపంచ ప్రజల పిలుపుకు, సోవియట్, చైనావీరవరుల ఆహ్వానానికి మనజవాబిదేనా? కాదు! ఇదికాదు. మనం స్వాతంత్ర్యం పాలిట హంతకులమనీ, ఫాసిస్టురాక్షసి సహాయకులమనీ చరిత్రలో తరతరాలు నిందించబడునట్లుగా ప్రవర్తించరాదు.

మనమందరం ప్రపంచ విముక్తి పోరాటంలో పాల్గొనాలనీ, - చైనా సోదరులు ఎట్టి ధైర్యసాహసాలతో, సోవియట్ మిత్రులు ఎట్టి త్యాగపటిమతో ఈ ఫాసిస్టు నరహంతకులతో పోరాడుతున్నారో ఆ విధంగానే పోరాడాలనీ మన మాతృదేశం మనలను ఆదేశించుచున్నది.

ఐక్యతానినాదమే మన స్వాతంత్ర్య సంపాదనకు మార్గం. ఇదే నవంబరు విప్లవానికి, సోవియటు ప్రజలకు తమ త్యాగంచే మన సరిహద్దులను రక్షిస్తున్న స్టాలిన్‌గ్రాడు వీరులకు కృతజ్ఞత తెల్పేమార్గం.

నవంబరు విప్లవం చిరస్థాయి యగుగాక!

లెనిన్‌గ్రాడు, మాస్కో, స్టాలిన్‌గ్రాడు వీర సంరక్షకులకు జోహారులు!

ప్రపంచమందలి పీడితప్రజలను విమోచన గావించ పోరాడుతున్న రెడ్ఆర్మీకి జోహారులు

ఫాసిస్టుపిశాచం పీచమడచ నడుంకట్టి నిల్చిన ప్రపంచప్రజల ఐక్యత సార్థకమగుగాక!

ప్రపంచాధిపత్యం కలలుగన్న ఫాసిస్టులకు బలివేదిక రష్యా

పదహారుమాసాల రష్యా - జర్మనీ యుద్ధ సమీక్ష

నాజీ జర్మనీ హంతకులు సోవియటు పవిత్రభూమిపై కాలుబెట్టి 16½ మాసాలు కావస్తున్నది. 1941 జూన్ 22 వ తేదీన హిట్లరు జర్మనీ గావించిన దాడిని, నేటివరకూ సోవియటు వీరప్రజలు అమోఘ త్యాగసాహసాలను ప్రదర్శించి ప్రతిఘటించారు. ప్రపంచాన్ని విస్మయసంభ్రమాల్లో ముంచివేశారు. సోవియటు యూనియను, నాజీ పాదాక్రాంతమే అయినచో? ఈ ప్రశ్న ప్రతి స్వాతంత్ర్య ప్రియుని గుండెలు జలదరింపజేస్తుంది. కామ్రేడ్ ఐ. షెర్మాషెవ్, చెప్పినట్లు "రష్యాలో హిట్లరే జయించివుంటే, ప్రపంచానికి మహోపద్రవం సంభవించేది. ఇదివరకు కనీ వినీ ఎరుగని స్థాయిలో ఆ వుపద్రవ ఫలితాలుండేవి. అనేక సంవత్సరాలుగా తీవ్రపోరాటం ద్వారా మానవజాతి సంపాదించుకొన్న ఫలితమంతా, కొన్ని శతాబ్దాలదాకా తిరిగిరాకుండా నశించిపోయేదంటే అదేమీ అతిశయోక్తికాదు. స్వతంత్ర దేశాల వినాశాన్ని హిట్లరు వాంఛించాడు. దానిని దేశాల సంకెళ్ళధ్వని ప్రపంచమంతా మార్మోగియుండేది. అన్ని ఖండాలలోను ప్రష్యన్ (జర్మను) కొరడా దెబ్బలు వినబడియుండేవి. అనేక భయానక క్రూరకృత్యాలు గావించిన హిట్లరు రష్యాపై దండెత్తినపుడు, మానవజాతి యెదుట ఒక అత్యంత తక్షణ సమస్య ఉదయించింది. వుండటమా? ఊడటమా? (To be or not to be) అనే సమస్య చరిత్రలో యే కాలంలోను మానవజాతి యెదుట యీ విధంగా యెదుర్కొని యుండలేదు."

జర్మనీకి అవకాశాలు

రూసో - జర్మనీ యుద్ధ ప్రారంభం, జర్మనీకి కొన్ని అవకాశాలతో ప్రారంభమయింది. దురాక్రమణ చేసే దేశానికి వుండే అవకాశాలు జర్మనీకి వున్నాయి. హఠాత్తుగా దాడి వెడలటము, అదివరకే యుద్ధ యంత్రాన్ని అంతా సమీకరించి వుండడం, రణరంగానికి పనికి వచ్చేటట్లుగా ఆర్థిక విధానాన్ని అంతా తిరిగి సంఘటిత పర్చడం, టాంకులలో, విమానాలలో ఆధిక్యత కల్గి వుండడం; ఇవి నాజీలకు గల అవకాశాలు. ఇంతేగాక సోవియటుపై యుద్ధంచేయడానికి జర్మనీ పూర్తిగా సైన్యాన్ని సమాయత్తపరచి వుంది. పోలెండు, బెల్జియం, ఫ్రాన్సు, గ్రీసు, యుగోస్లేవియా మొదలైన దేశాలలో, వందలు, వేలకొలది విమానాలను టాంకులను ఉపయోగించి చేసిన ఆధునిక యుద్ధ అనుభవం జర్మనీకి వుంది.

ప్రథమదశ

అందుచే ప్రథమ దశలో సోవియటు సైన్యాలు వెనక్కి పోవలసివచ్చింది. కాని సోవియటు సైన్యాలు వెనక్కి వెళ్ళవలసి వచ్చినా శత్రువుకు తీవ్రమైన వజ్రఘాతాలను ఒదిగించిన పిదపనే, వెనక్కి పోయాయి, యుద్ధ క్రమంలో రెడ్ఆర్మీ నాయకులు, సైనికులు కూడా శత్రువుల యెత్తులను టెక్నిక్‌ను నేర్చుకున్నారు. గట్టిపడ్డారు. ఇలా నవంబరు మాసందాకా గడిచింది. నవంబరు మాసం వరకు జరిగిన యుద్ధక్రమాన్ని చూద్దాం.

జూన్‌లో సోవియటుపై యుద్ధం ప్రారంభమయింది. సెప్టెంబరులో లెనిన్‌గ్రాడ్, ఒడెస్సా, కీవ్, క్రిమియాన్నులను శత్రువు సమీపించాడు. స్మోలెన్స్కు రంగంలో, మాస్కో వైపుకు చొచ్చుకుపోవ ప్రయత్నించాడు.

పరిస్థితులు విషమంగా వున్నాయి. ఒక్కొక్క ప్రతిఘటనతోనే సంతృప్తిపడక రష్యన్లు తిరుగుదాడులు గావించారు; స్మోలెన్స్కు రంగంలో యెల్నా నగరం సోవియటుచే పట్టుకోబడింది.

ఎన్నో నష్టాలు గల్గుచున్నా లెక్కచేయక యూరపునందంతటినుండీ సమీకరించిన సైన్యాలతో, హిట్లరు 1941 అక్టోబరు 2 వ తేదీన మాస్కోపై నిశ్చిత దాడిని సాగించుతున్నానని ప్రకటించాడు. మాస్కోను పట్టుకోడానికి విశ్వ ప్రయత్నం చేసి విఫలుడయ్యాడు. మాస్కోను పట్టుకొన ప్రయత్నించుటలోని ఉద్దేశ్యం, మాస్కో రాజకీయ పారిశ్రామిక కేంద్రమగుటవల్లనే కాదు; చలికాలంలో తమ సైన్యాలకు స్థావరం దొరుకుతుందని ఆశపడ్డాడు హిట్లర్.

మాస్కో పశ్చిమంగా అర్థ చంద్రాకారంగా నున్న కాలినిన్, వొలొకొలామ్‌స్కు, మెజాయిస్కు, మాలొ - యరొస్లావెట్సు, తులా నగరాలవద్ద భీషణ యుద్ధాలు జరిగాయి నవంబరు 16 వ తేదీన హిట్లరు యెన్ని కష్టనష్టాలకైనా ఓర్చి మాస్కోను వశం చేసుకోవాలని దాడి ప్రారంభించాడు. 13 టాంకు డివిజన్లను, 33 కాల్బల దళాలను, 5 మోటార్లలో గూడిన పదాతి దళాలను ఉపయోగించి రెండవసారి మాస్కోపై దాడి చేశాడు. కాని నేటికీ మాస్కో అచంచలంగా నిలబడింది. "నెపోలియన్ మాస్కోనైనా ప్రవేశించాడు; కాని హిట్లరుకు మాస్కో ఫోటో మాత్రమే లభిస్తుంది" అన్న లోజవస్కీ జోస్యం నిజమయింది.

ఇక దక్షిణరంగంలో, డాన్ మైదానాలను ప్రవేశించి, రోస్టావ్‌గుండా కాకాసస్ ప్రవేశించాలని హిట్లరు ఆశించాడు. 1941 అక్టోబరు మాసంలో సాగించిన దాడిలో, డాన్‌ప్రాంతాలలో కొద్ది భాగాన్ని కైవశంచేసుకొని, నవంబరులో గావించిన అకస్మాత్తుదాడితో, రోస్టావ్‌ను ఆక్రమించుకొన్నాడు. ఈ విధంగా ప్రథమదశ ముగిసింది.

శీతాకాలంలో రష్యాఎదురుదాడి

నవంబరులో జర్మన్ ఫాసిస్టులకు తీరని నష్టాలు గల్గించిన - నవంబరు మాసాంతంలో రోస్టావ్‌ను పునరాక్రమించుకొన్న - రెడ్ఆర్మీ, కామ్రేడ్ స్టాలిన్ ఆదేశానుసారంగా డిశంబరు 6వ తేదీన తిరుగుదాడులు ప్రారంభించింది, ఇది ఒక చరిత్రాత్మక ఘటన. హిట్లరు మాస్కో యుద్ధంలో అపజయంపొందాడు. చలికాలంలో అనేకవేల ఆక్రమిత గ్రామాలను సోవియట్ తిరిగి ఆక్రమించి, శత్రువును వెనక్కితరిమింది.

చలికాలంలో, కాస్త ఊపిరిపీల్చుకొని, నిలబడి, యుద్ధం (Positional, trench warfare) చేయాలని నాజీ జర్మనీ తలంచింది; ఛిన్నాభిన్నమై అలసిపోయిన తమ సైన్యాలకు విశ్రాంతినిచ్చి, తిరిగి సమీకరించి, వసంతకాలంలో మరొక పెద్దదాడి సాగించుదామని హిట్లరు కలలు కన్నాడు. కాని డిసెంబరునుండి మార్చివరకు జర్మన్లను యుద్ధనిమగ్నులను గావించింది రెడ్ఆర్మీ, వసంతకాలానికని అట్టిపెట్టుకొన్న సైనిక, ఆయుధ సంపత్తిని ఖర్చుపెట్టేటట్లుగా చేసింది. తీవ్ర శీతాకాలంలో, అత్యంత కష్ట పరిస్థితులలో, జర్మనీ యుద్ధ యంత్రానికి పెద్దదెబ్బగొట్టి, 1942 లో రెండవ రంగం తెరిస్తే, నాజీజర్మన్లు ఓడిపోయే అవకాశాన్ని కలుగ చేసింది.

వసంతదాడీ విఫలమయింది

చలికాలంతో జర్మను ప్రజలకు, నాజీ నాయకులు, అనేకసార్లు, వసంతకాలంలో నిశ్చితమైన దాడి ప్రారంభమవుతుందని వాగ్దానం చేశారు. వసంతకాలం వచ్చేసరికి, జర్మని సామ్రాజ్యవాదులు మరికొంత ఆయుధసంపత్తిని,సైనికబలాన్నిసమీకరించినమాటనిజమే. కాని అలా చేయడానికి, ఆక్రమిత దేశాలలోను, తనకు తొత్తులుగా వున్న దేశాలలోను, పీల్చి పిప్పిచేయవలసి వచ్చింది. ఆయుధం మోయగల ప్రతివానినీ, చివరకు కొంతవరకు వికలాంగులయినవారిని సైతం, మిలటరీ సర్వీసుకు కొనిరావలసి వచ్చింది. అయినా, శీతాకాలంలోని దెబ్బ, వసంతకాలంలో దాడిచేయ వీలు లేకుండా చేసింది. జర్మన్లకు వాగ్దానం చేయబడిన "వసంతదాడి" అలాగే వుండిపోయింది.

సంవత్సరములో నష్టాలు

సోవియటు - జర్మను యుద్ధరంగం చాల దీర్ఘంగా వుంది అలాంటి పరిస్థితులలో, కొన్ని చోట్ల సైన్యాలను, టాంకులను విమానాలను కేంద్రీకరించి కొన్ని విజయాలను సంపాదించడం అసంభవం కాదు. అలాంటి విజయాలు తాత్కాలికమైనవే. పేర్చి కూర్చిన దిట్టమైన జర్మనుసైన్యాలు దెబ్బతిన్నాయి. కొంతవరకు కావక్ అఫీసర్లు రెడ్ఆర్మీచే హతులయ్యారు. ఆక్రమిత ప్రాంతాలలోని ఘోరాలను జూచి కొందరు నైతికశక్తిని కోల్పోయారు. జూనియర్ కమాండర్లు (చిన్న సైన్యాధిపతులు) దొరికిపెట్టబడుటచేత, మామూలు సైనికుల నుండి వారిస్థానే నియమించవలసి వచ్చింది. ఒక్క సంవత్సర కాలంలో జర్మనీకి గల్గిన నష్ట పరంపరలు చూచినట్లయితే జర్మనీ పటిమ యెంత తగ్గిపోయిందో చూడవచ్చు.

నష్టాలు

	జర్మనీ	సోవియటు యూనియన్
గాయపడినవారు, చనిపోయినవారు, ఖైదీలు	కోటి మంది	45 లక్షలు
ఫిరంగులు	30,500	22,000
టాంకులు	24,000	15,000
విమానాలు	20,000	9,000

జర్మని నష్టపడిన కోటిమందిలో 35 లక్షల మంది మృత్యువువాతనే పడ్డారు. ఇంతేగాదు. రెడ్ఆర్మీ సైనికులలో గాయపడినవారికి తగిన వైద్యసౌకర్యాలుండుటవల్ల 100 కి 70 మంది మరల సైన్యానికి పనికివచ్చారు. కాని జర్మను సైనికులలో గాయపడినవారు 100 కి 40 మంది మాత్రమే తిరిగి సైన్యంలో చేరగల్గారు.

వేసవిదాడికిముందు

హిట్లరు దెబ్బతిన్నా డన్నంతమాత్రాన, హిట్లరు ఓడిపోయే అవకాశాలు సృష్టించబడ్డాయి అన్నంతమాత్రాన, ప్రమాదం పూర్తిగా తొలగిందని అర్థంకాదు. మామూలు సమయంలోకన్న దెబ్బదిన్నపులి మరింత ప్రమాదకరం. 1942 లో జరిగే యుద్ధం, జీవన్మరణ యుద్ధం. రెండవరంగం తెరవకముందే, చలికాలంరాకముందే, తన ప్లానును కొనసాగించాలని హిట్లరు ఆశించాడు.

మే 8 వ తేదీన కెర్చిభూసంధిని ఆక్రమించుకోడానికి నాజీసేనలు ముందుకురికాయి. కెర్చిని ఆక్రమించుకొని, ఖార్కోవ్ నుండి డొనెట్సు, డాన్‌నదులదాటి మరొకనాజీసైన్యం కాకేషియామీదకు నడవాలనితలంచింది. కెర్చిపైకి నాజీలు రాగానే, ఖార్కోవ్ రంగంలో సోవియటు సైన్యాలు విరుచుకు పడ్డాయి. మే నెలాఖరుకు కెర్చి ద్వీపకల్పం నాజీల అధీనమయింది. కాని ఖార్కోవ్ రంగంలో నాజీ ఎదురుదాడి ప్రయత్నాలు విచ్ఛిన్నం అయ్యాయి.

కెర్చినుండి ముందుకు పోవడానికి నాజీ సేనల ప్రక్కలో బల్లెంగావున్న సెవాస్టపూల్‌ను ఆక్రమించుకోవాలని నాజీలు తీవ్ర యుద్ధం సాగించారు.

సోవియట్ సైన్యాలు కెర్చి ద్వీపకల్పంలోకి తిరోగమించవలసివచ్చిన దిమ్మడనే సెవాస్టపూల్ ముట్టడి ప్రారంభమయింది. రెండవ దాడి 1941 నవంబరులో ప్రారంభమయింది. డిశంబరులో సోవియట్ సైన్యాలే తిరుగుదాడి గావించి కెర్చి, ఫియొడోసియాలను ఆక్రమించాయి. మూడవ నాజీదాడి కెర్చి ద్వీపకల్పం నాజీల వశమయ్యాక, 1942 జూన్ 7 వ తేదీన ప్రారంభమయింది 15 కాల్బల డివిజన్లతో, 3 టాంకు మెకనైజ్డ్ దళాలతో, మొత్తం 3 లక్షల సైన్యాలతో 400 కు పైన టాంకులతోను, 900 విమానాలకుపైగా విమానాలతోను, జర్మన్లు దాడి ప్రారంభించారు. జులై 3 వ తేదీన సెవాస్టపూల్ ఖాళీచేయబడింది. సెవాస్టపూల్ 8 నెలల ప్రతిఘటన, సెవాస్టపూల్‌లో లక్షన్నర (చనిపోయినవారు గాయపడినవారు, ఖైదీలు) నాజీలను 25 దినాలలో బలిగొన్న సోవియట్ శౌర్యం, ప్రపంచాన్ని విస్మయపరచింది.


సెవాస్టపూల్ పతనంతో క్రిమియా నాజీల వశమయి, కెర్చి జలసంధిని దాటి కాకేషియా వైపుకు పోడానికి అవకాశమిచ్చింది. కాని అందుకు ఖార్కోవ్‌నుండి డొనెట్సు; డాన్‌లను దాటాలసిన అవసరముంది.

వేసవిదాడి

జూన్ 28 వ తేదీన హిట్లరు తన దాడిని ఖార్కోవ్‌నుండి వొరొనెజ్ వైపుకు, మరోప్రక్క డాన్, డొనెట్సులవైపులకు ప్రారంభించాడు. జులై 27 వ తేదీకి డాన్ ములుపును, కాకాసస్‌పర్వత ప్రాంగణాలు రాగలిగాడు, (జులై 8వ తేదీన రోస్టావ్ జర్మన్ల వశమయింది.) డాన్ ములుపునుండి స్టాలిన్‌గ్రాడ్‌కు రావడానికి రెండు నెలలుపట్టింది. అలాగే నొవొరొసిస్కు మొజ్డాక్‌ల వద్దకు చేరడానికి దాదా యింత కాలం పట్టింది. 3 నెలల నుండి స్టాలిన్‌గ్రాడ్ వద్ద, నొవొరొసిస్కు ప్రాంతాల, మొజ్డాక్ వద్ద, హిట్లరు దాదు దెబ్బలు తింటున్నాడు.

హిట్లరు ప్లాను తల్లక్రిందులయింది

1942 హిట్లరుప్లాను తల్లక్రిందు అయింది. హిట్లరుప్లానేమిటి? సోవియటు - జర్మనీ యుద్ధరంగం 10 వ వంతు ప్రదేశంలోనే, అత్యధిక సంఖ్యాకమైన బలాలను కేంద్రీకరించి దక్షిణదేశాన్నంతా (క్యూబాన్, ఉత్తరకాకేషియా, ట్రాన్సుకాకేషియా) ఆక్రమించడం.



" ప్రశాంతంగా, ఆత్మ విశ్వాసంతో; క్రెమ్లిన్‌లో కూర్చుని, ప్రపంచ యుద్ధమనే గొప్ప చదరంగంలో, అతడెప్పుడూ 1కి 15 ఎత్తులు ముందు వేస్తున్నాడు. వినాశకరమైన పొరపాట్లను ఒకదాని వెనుకనొకటి గావించుతున్న పిచ్చి హిట్లరును చూస్తున్న స్టాలిన్ నేత్రాలలో, కొంటె చిరునవ్వు వుట్టిపడు తూంటుంది."

— అలెక్సీ టాల్‌స్టాయ్

స్టాలిన్‌గ్రాడ్‌ను వశంచేసుకొని వొల్గా తీరాన్ని - కాస్పియా సముద్రతీరాన్ని ఆక్రమించడం.

1941-42 దాడిలో, అనేక రక్షణశ్రేణులను ("ఓస్ట్‌వాల్") నిర్మించాడు. బాల్టిక్‌సముద్రం నుండి, దాదాపు వొరొనెజ్‌వరకు ఇలా నిర్మించాడు, వీటిపై ఆధారపడి, మొత్తం సోవియటు యుద్ధరంగంలో 10 వ వంతు మాత్రమే వున్న దక్షిణరంగం పైకి దాదాపు తన యావత్ శక్తితోనుఉరికాడు. ఈ అత్యధికసంఖ్యాబలం, వల్ల, చలికాలం రాకముందే, స్టాలిన్‌గ్రాడు, వొల్గా, కాకాసస్‌లలో జొరబడగలనని తలిచాడు. ముఖ్యపట్టణాలను, ప్రదేశాలను జయించిన మాట నిజమే. స్టాలిన్‌గ్రాడ్‌లోను, కాకాసస్ ప్రాంగణంలోను సోవియటు సైన్యాలు నిలబడి పోరాడవలసి వచ్చినమాట నిజమే. కాని జర్మన్లు, తమకు విపరీతనష్టాలతో పాటు టైంటేబిల్ తల్లక్రిందుకై, సోవియటు శీతాకాలపు తిరుగుదాడులకు గురిఅయేటట్లు, వుండవలసి వస్తోంది.

సోవియటుప్రతివ్యూహం

1942 లో, 1941 నాటి బలం నాజీలకు లేదని సోవియటుకు తెలుసు. కాని ఒకానొక ఇరుకు రంగంలో గనుక శత్రువు కేంద్రీకరించితే అతడుఅపాయకారి అవుతాడని, సోవియటుకు తెలుసు. రెడ్ఆర్మీని నాశనం చేయడం, బాకూ నూనె గనులనుండి, మిత్ర దేశాలనుండి సోవియటును విడదీయడం - యిదీ హిట్లరు అంతిమ నిస్పృహాజనిత ప్రయత్నం.

క్రిమియాను, వశంచేసుకోడానికి, డొనెట్సు బేసినగుండా రోస్టావ్‌ను పట్టుకోడానికి, డాన్ బేసిన్ గుండా స్టాలిన్‌గ్రాడ్ వైపుకు, డాన్‌నదిని ఛేదించడానికిగాను వొరొనెజ్ వైపుకు, ఒక్కసారి దాడిసల్పడానికి ఖార్కోవ్ వద్ద సైన్యాలను హిట్లరు కేంద్రీకరించుతున్నాడనితెలిసే మేనెలలో సోవియట్‌సైన్యాలు ఖార్కోవ్‌రంగంలో విజృంభించాయి. అందుచే పైనాల్గుదాడులుఒకేసారిహిట్లరుప్రారంభించలేకపోయాడు. ఒకదానితర్వాత ఒకటిగా సాగినఈ దాడులలోపటిమ అంతకంతకూతగ్గింది. సెవాస్టపూల్ ప్రతిఘటన, దాటుంలో సోవియట్ నల్ల సముద్రనౌకలు రక్షణ తీసుకోడానికి సరియైన వ్యవధినిచ్చింది. వొరొనెజ్‌వైపు దాడిని తిరిగికొట్టారు. దీనిని నిలబెట్టు కొనుట ద్వారా స్టాలిన్‌గ్రాడ్ సప్లయి లైనులను సోవియట్ నిలబెట్టుకోగల్గింది. డాన్‌బేసిన్‌గుండా స్టాలిన్‌గ్రాడ్ చొచ్చుకొనుచున్న జర్మన్ల పార్శ్వంలో, సమయం వచ్చినప్పుడు దెబ్బ గొట్టడానికి వీలుండే కీలక స్థానాన్ని నిలబెట్టుకొంది

డొనెట్సు, డాన్ బేసిన్లలో తీవ్రప్రతిఘటనతోను,తిరుగుదాడులతోను,పార్శ్వదాడులతోను, జర్మన్లకు విపరీత నష్టాలతోపాటు కాలవిలంబనం కల్పించారు సోవియటు సైనికులు. డొనెట్సుబేసిన్ పోయింది. రోస్టావ్ ఖాళీచేశారు. క్యూబాన్‌లో హిట్లరు చొచ్చుకుపోయి కాకాసస్ ప్రాంగణంలో నిలబడ్డాడు. డాన్‌బేసిన్‌లో స్టాలిన్‌గ్రాడ్ వైపుకుపోయి, డాన్‌నదినిదాటి, స్టాలిన్‌గ్రాడ్‌నగరంలో భీషణయుద్ధం చేస్తున్నాడు, కాని ఇదంతా జరగడానికి 8 నెలలు పట్టింది. అయినా అతని ఆశయాలు నెరవేరలేదు. రెడ్ఆర్మీని చుట్టుముట్టడంగాని నాశనం చేయడంగాని సంభవించలేదు. చలికాలంలో స్టాలిన్‌గ్రాడ్‌లో తలదాచుకుందామన్న ప్లాను 1941లో మాస్కోకోసంవలెనే విఫలమయింది. కాకాసస్‌లోని నూనెగనులు చిక్కడానికి బదులు, నాజీ హంతకులకు కాకాసస్ పర్వత ప్రాంగణాలలోనే సమాధి దొరుకుతుంది.

స్టాలిన్‌గ్రాడ్ ప్రతిఘటన యావత్తు అక్ష రాజ్య వ్యూహాలనే తలక్రిందులు చేస్తోంది. ఈనాటివరకు అక్ష రాజ్యాలే ముందు దాడి సాగించుతూ వచ్చాయి. చొరవకూడా వాళ్ళదే. కాని ఇపుడా ప్లాను తలక్రిందు లవుతోంది. హిట్లరు ఆత్మరక్షణా వ్యూహానికి యెలా దిగుతున్నాడో గతవారం వివరించాం.

హిట్లరు మొదట తలచినట్లుగా ఆగస్టులోనే స్టాలిన్‌గ్రాడ్ పడిపోతే అది మిత్ర రాజ్యాలకు పెద్ద దెబ్బ అయివుండేది, మధ్య ప్రాచ్యంలో హిట్లరు దాడి చేయగల్గి వుండేవాడు. బ్రిటన్‌పై దాడిచేయగల్గి వుండేవాడు. మన మాతృదేశపు పశ్చిమ గుమ్మంలో కూర్చుని యుండేవాడు. స్టాలిన్‌గ్రాడ్ వీరులు, కామ్రేడ్ కాలినిన్ చెప్పినట్లు కాకాసస్ యోధులు, మన పవిత్ర మాతృ దేశాన్ని తమ మేని దొమికెలతో మహా కుడ్యాన్ని నిర్మించి, అడ్డుపెట్టి కాపాడుతున్నారు........

శీతా కాలంలో

చలికాలం ప్రారంభ మవుతోంది. అప్పుడే రెండు పక్షాలు కష్టంతో యుద్ధం చేయవలసి వస్తోంది. అయినా నవంబరు నెలాఖరువరకు ఇప్పటివలె కొన్ని ప్రాంతాల యుద్ధం జరగవచ్చు. కాని తర్వాత హిట్లర్‌సైన్యాల పరిస్థితి ప్రమాదకరమౌతోంది. సోవియటు మైదానాలలో చిక్కుపడకుండా వుండటానికి గాను జర్మను సైన్యాలు డాన్ నదికి పశ్చిమంగా రోస్టావ్, వొరొషిలావ్ గ్రాడ్ మొదలైన పట్టణాలకు తిరిగి పోవలసి వస్తుంది. స్టాలిన్‌గ్రాడ్‌ను కూడ వదులుకొని, సురక్షిత మనుకొన్న శ్రేణికి హిట్లరు వెనుదరుగ వలసి వస్తుంది.

రాజకీయ ఫలితాలు

సోవియటు యూనియన్‌పై దండెత్తడానికి ముందు, హిట్లర్ హెర్‌హెస్సును బ్రిటను పంపాడు. రష్యాకు వ్యతిరేకంగా బ్రిటను అమెరికాలను కూడగట్టుకొందామని కలలు గన్నాడు. కాని తద్వ్యతిరేకం జరిగింది. అమెరికా బ్రిటనులు సోవియటు పక్షం వచ్చాయి. 1941 మే 26 తేదీన ఇంగ్లండు రష్యాల మధ్యను, జూన్ 11 వ తేదీన అమెరికా రష్యాల మధ్యను ఒడంబడిక జరిగింది. ఈ ఒడంబడికలతో, సోవియటు యూనియను నాయకత్వాన ప్రపంచప్రజలు ఫాసిజానికి విరుద్ధంగా ఒక బ్రహ్మాండమైన స్వాతంత్ర్య యుద్ధానికి పూనుకొన్నారు. 1942 జూన్ 11 వ తేదీన ఆంగ్లో-సోవియటు ఒడంబడికతోపాటు 1942 లో యూరప్‌లో రెండవ రంగాన్ని కల్పించే తక్షణ సమస్యలను గురించి ఒడంబడిక జరిగింది. ఈ ఒడంబడికలు, సోవియటు ప్రజలతో ప్రపంచప్రజల ఐక్యతను మరింత వృద్ధిపరచాయి.

సోవియటు శ్రేణుల వెనుభాగం దృఢంగా వుండదని హిట్లరు అంచనా వేశాడు. ఆక్రమిత యూరప్‌లో వలెనే, సైన్యాల నైతికబలం చెడగొట్టగలననీ, లోపలనుండే సోవియటుశ్రేణుల వెనుభాగాన్ని నష్టపరచవచ్చనీ, ఆ విధంగా సోవియటు ప్రతిఘటనను నాశనం చేయవచ్చుననీ ఆశించాడు.

కాని తద్విరుద్ధంగా జరిగింది. స్త్రీలు పిల్లలతోసహా గెరిల్లాలై సోవియటు శ్రేణుల వెనుభాగంలో, హిట్లరును ఎదుర్కొన్నారు. సైనికులనే గాక యావన్మంది ప్రజ... హిట్లరు గ్యాంగు ఎదుర్కొన వలసివచ్చి... కార్మిక కర్షక మేధావులలో ఐక్యత, ... జాతుల మధ్య ఐక్యత మరింత దృఢప... ఒక్కదేశ ద్రోహికూడా, జర్మన్లకు ది... లేదు.

యుద్ధం ప్రారంభంకాగానే, సమిష్టి... సాయకులంతా తిరగబడి, కార్మికవర్గ... సోవియటు అధికారాలపైన యుద్ధంచేస్తా... భావించారు, కాని అది జరగలేదు. య... సోవియటు విధానం, రాజకీయ సైనిక ... సంఘటన (ఆర్గనైజేషన్)లు, కూడా ... కష్టాల నెదుర్కొని దృఢంగా నిలబడ్డాయి...

ఫాసిస్టులదాడి ఎప్పటికైనా తప్ప... దావంతో, ఫాసిస్టు దురాక్రమణదారులకు ... రేకంగా స్వాతంత్ర్య ప్రియుల సంఘ... సంఘటనకై సోవియటు రష్యా కృషిచేసి... పరిశ్రమలు, వ్యవసాయం, విజ్ఞానం, ... లను అన్నివిధాలా వృద్ధిచేసి సోవి... బలాన్ని వృద్ధిచేసింది ఆవిధంగా సోవి... రాజకీయ నాయకుల దూరదృష్టి సరియై... యని ఋజువుచేసికొంది.

ఇక ఫాసిస్టుల సంగతి చూద్దాం. ఆక్ర... యూరప్‌లో అగ్నిజ్వాలలు రోజురోజూ ... భించుతున్నాయి. నార్వే ప్రజల తిరుగుబా... ఫ్రెంచి కార్మికుల సమ్మెలు, యుగోస్లే...

కామ్రేడ్
తుమ్మల వెంకటరామయ్య

గెరిల్లాలయుద్ధాలు, జక్-హంగేరీ-రుమేని... లలోని కమ్యూనిస్టు తిరుగుబాట్లు, హి... గొంతుపై పొంచివున్నాయి. నిప్పంటించ... తరువాయి. అగ్నిపర్వతం బ్రద్దలవుతుంది...

హిట్లరు మరా అతిచౌకగా వాగ్దానం చే... విజయాలు అలాగే వుండిపోయాయి. ... ధారాలను ఆక్రమిత యూరప్‌నుండి దో... ద్వారా తగ్గించాలని హిట్లరు ప్రయత్నిస్తున్నా... దానిస కార్మికుల ద్వారా యుద్ధ ఉత్ప... పెంపొందించ తలుస్తున్నాడు. ఒక సేనాధి... తర్వాత మరో సేనాధిపతికి "గుండె జబ్బు... అధిక మవుతున్నాయి. మిలటరీ నాయకు... నాజీ పార్టీకి, అధికార వర్గానికి ప్రజ... మధ్య కలత పెంపొందుతోంది, హి... స్వయంగా సైన్యాధిపత్యం వహించి సంపా... చినది, తన సైనికాధిపతుల శిరస్సులనే!

ఇంతవరకు రెండవ రంగం యేర్పడతే... ఈ లోటును హిట్లరు ఉపయోగించుకో... కుండా స్టాలిన్ గ్రాడ్ వీరులు, కాకా... యోధులు, అరికడుతున్నారు. యిప్ప... ఆలస్యమయిపోయిన రెండవరంగం, ఆ... మిత ప్రాంసులో ప్రారంభంకావాలి. యూ... ఫ్రెంచి ప్రజల అసంతృప్తి జ్వాలలను మ... ప్రళయాగ్నిగా మార్చడానికి రెండవరం... కావాలి. ఆ అగ్నికీలలలో ఫాసిస్టుపిశాచాల... పరిమార్చాలి. 1943 లో హిట్లరును ... మార్చడం ప్రారంభమవుతుంది. సోవియ... యూనియన్ నాయకత్వాన, సోవియటు ప్ర... నాయకత్వాన, వీర రెడ్ఆర్మీ నాయకత్వా... ప్రజావిజయం 1943 లో లక్ష్యమై తీరుతుంది...

స్టాలిన్ దూరదృష్టిఫలితమే ఊరల్ పర్వత పరిశ్రమలు

1930 లో సోవియటుయూనియన్ యొక్క 16 వ పార్టీ సమావేశం జరిగింది. అందులో స్టాలిన్ యిచ్చిన రాజకీయ రిపోర్టులో యిలా వుంది :—



" ఈ పరిశ్రమలను (ఉక్రెయిన్‌లోవున్న బొగ్గు - యినుము పరిశ్రమలు) మనం యిక ముందు కూడా సాధ్యమైన అన్ని మార్గాల లోను అభివృద్ధి పర్చవలసిందే. బొగ్గు - యినుము విరివిగా ఉత్పత్తిచేయడానికి మరొక కేంద్రాన్ని సృష్టించవలసియుంది. ఇది మన నూతన కర్తవ్యం. ఈ కేంద్రమే ఊరల్ - క్యుస్నెట్స్కి పరిశ్రమ కేంద్రం. క్యుస్నెట్స్కి లో దొరికే బొగ్గు, ఊరల్ పర్వతాలలో దొరికే ముడి యినుము, ఒకదానికొకటి చేర్చి రెంటిని అభివృద్ధి చేయవలసి యుంది "

ప్రపంచ మంతటికీ పెద్ద బొగ్గు గనులు

క్యుస్నెట్స్కి బొగ్గు గనులు ఊరల్ పర్వతాలకు 1,250 మైళ్ళు తూర్పున వున్నాయి. ఇనుమును కరిగించడానికి ఉపయోగించే "కోకింగ్ బొగ్గు" ఇచట విరివిగా లభ్యమౌతుంది. మొత్తం బొగ్గు 40,000 కోట్ల టన్నులు క్యుస్నెట్స్కి గనులలో వున్నాయని శాస్త్రజ్ఞులు అంచనా వేశారు. "ప్రపంచ మంతటిలోను యీ బొగ్గు గనులలో దొరికే బొగ్గే పెద్ద మొత్త"మని 1937 లో మాస్కోలో జరిగిన అంతర్జాతీయ భూగర్భ శాస్త్రజ్ఞుల సమావేశానికి, గ్లాస్గో (బ్రిటన్) నుంచి వచ్చిన డాక్టర్ హైరెల్ తెలియ జేశారు.

1940 లో ఉక్రెయిన్‌లో 8 కోట్ల టన్నులు, క్యుస్నెట్స్కిలో 2 కోట్లు, ఊరల్ పర్వతాలలో 50 లక్షల టన్నులు, కరగాండాలో 50 లక్షలు, తూర్పు సైబీరియాలో 40 లక్షలు, బొగ్గు తీయబడింది. ఉక్రెయిన్ జర్మన్ల వశమైన తర్వాత అచటి బొగ్గును రష్యా కోల్పోయినప్పటికీ క్యుస్నెట్స్కి మొదలైన ప్రదేశాలలో బొగ్గు గనులను కొత్త పద్ధతులతో యెక్కువ గంటలసేపు పని చేయిస్తున్నారు. ఇంతేగాక కజాకస్తాన్‌కు 30 మైళ్ళ దూరంలో 12 కోట్ల టన్నుల బొగ్గు దొరికే గనులు ఇటీవల కనిపెట్టబడ్డాయి. ఊరల్ పర్వతాలలో బష్కీరియా బొగ్గు గనులలో 20 కోట్ల టన్నులున్నాయి. పడమటి సైబీరియాలో బెయిదెన్స్కీ బొగ్గు గనులలో సంవత్సరానికి 10 లక్షల టన్నులు ఉత్పత్తి చేయవచ్చు. కొత్తగా కనిపెట్టబడిన యీ పై బొగ్గు గనులలో పని ప్రారంభమై చురుకుగా నడుస్తోంది.

ఊరల్సులో యినుము పరిశ్రమ

ఉక్రెయిన్ శత్రు వశమైనప్పటికీ, యీ బొగ్గు ఊరల్ యినుము పరిశ్రమను పూర్తిగా సరిపోతుంది. ఏటేట యిది అభివృద్ధి చెంది యింకా యెక్కువ బొగ్గు కావలసివస్తే కొత్తగా కనిపెట్టబడిన బొగ్గు గనులు విరివిగా బొగ్గు సప్లయి చేయగలుగుతాయి. ఊరల్సులో మాగ్నిట్నయా పర్వతం మీద విశేషముగా యినుప గను లున్నాయి. ఈ యినుమును పైకి తీసి, కరిగించి, ఉక్కుగా తయారుచేయడానికి యూరపు అంతటిలోను పెద్ద పరిశ్రమాలయం అక్కడే కట్టబడింది. ఇదే మాగ్నిటోగోర్స్కి ఐరన్ అండ్ స్టీల్ వర్క్సు. ఇక్కడ ప్రతి సంవత్సరం దాదాపు 30 లక్షల టన్నుల యినుము కరిగించబడి ఉక్కుగా తయారౌతుంది. ఇందుకు కావలసిన బొగ్గు సప్లయి క్యుస్నెట్స్కి గనులనుంచి వస్తుంది. అటు క్యుస్నెట్స్కిలో కూడా మరొక యినుప పరిశ్రమాలయం నెలకొల్పబడింది. ఊరల్ పర్వతాలనుంచి వచ్చే ముడి యినుమును అక్కడ దొరికే బొగ్గుతో కరిగిస్తూ వుంటారు. ఈ పరిశ్రమాలయమే స్టాలిన్ ఐరన్ అండ్ స్టీల్ వర్క్సు. ప్రతిరోజూ, రాత్రింబగళ్లూ మాగ్నిటియా పర్వతం నుంచి క్యుస్నెట్స్కి బొగ్గు గనులకూ, క్యుస్నెట్స్కి బొగ్గు గనుల నుంచి మాగ్నిటయా పర్వతంవైపూ, రైళ్ళు ప్రయాణం చేస్తూవుంటాయి. ఇనుము తీసుకెళ్ళిన రైలు, బొగ్గును తీసుకొస్తుంది; బొగ్గు తీసుకెళ్ళిన రైలు, యినుమును తీసుకొస్తుంది. మాగ్నిటోగోర్స్కి - క్యుస్నెట్స్కిల మధ్య ప్రతి సంవత్సరం యీ విధంగా సుమారు 60 లక్షల టన్నుల యినుము కరిగించబడుతోంది.

ఇనుము ఉక్కుగా తయారు చేయబడిన తర్వాత దాన్ని వేర్వేరు కేంద్రాలకు పంపుతారు. ఊరల్సు మెషినరీ వర్క్సులో దీన్ని యంత్రాలు తయారు చేయడాని కుపయోగిస్తారు. చెల్యాబిన్స్క్‌లో టాంకులు విరివిగా తయారు జేస్తారు. గోర్కీ ఆటోమొబైల్ వర్క్సులో యుద్ధ విమానాల ఇంజన్లు, డీసెల్ ఇంజన్లు తయారౌతాయి.

కజాక్‌స్థాన్

ఈ విధంగా, ఊరల్స్ - క్యుస్నెట్స్కిలలో స్థాపించబడిన ఇనుము, బొగ్గు పరిశ్రమలు సోవియట్ యూనియన్ యొక్క రక్షణలో ఒక బలమైన గొలుసువలె పనిచేస్తున్నాయి. కాని, గొలుసు యింకా పొడవు ఉంది. కజాక్‌స్థాన్ యీ గొలుసులో మూడవలింకు. సోవియట్ యూనియన్‌కంతకూ యెక్కువ రాగి, తగరం, యిచటదొరుకుతాయి. బంగారం, పెట్రోలు, విషయంలో దీనిది రెండవస్థానం. బల్ఖాష్ సరస్సు సమీపంలో రాగిని కరిగించే యంత్రాలయమంత పెద్దది యూరప్‌లో ఎచ్చటాలేదు. కొన్రాడ్, జెస్కాజ్‌గాన్‌లలో దొరికే రాగి ప్రపంచంలో మరెక్కడా దొరకదు.

మధ్య వోల్గా

గొలుసులో నాల్గవ లింకు మధ్య వోల్గా ప్రదేశం. తూర్పుదిశనుంచీ, దక్షిణంనుంచీ, ఇచటికి ప్రతిరోజు వోల్గానది మీదుగా ఉక్కు చేరుతూవుంటుంది. పెర్మ్, యరోస్లావ్, రైబిన్స్క్, ఖజాన్, గోర్కీ, క్యుబిషీవ్, స్టాలిన్‌గ్రాడ్, సారటోవ్ మొదలైన పట్టణాలలో అద్భుతమైన ఇంజనీరింగ్ పరిశ్రమలున్నాయి. మాగ్నిటోగోర్స్కులో తయారైన ఉక్కుతో యిచ్చట టాంకులు, మరఫిరంగులు వగైరా తయారు చేస్తారు.

అపూర్వమైన అవకాశం

ఈ విధంగా సోవియట్ ప్రభుత్వం రష్యాకు పడమటనున్న పరిశ్రమలతోబాటు ఊరల్సులోను, సైబీరియాలోను, బ్రహ్మాండమైన పరిశ్రమలు వృద్ధిచేయడంవల్ల, చరిత్ర యేదేశానికీ ఇవ్వని అపూర్వమైన అవకాశం రష్యాకులభించింది. సైన్యానికి రిజర్వు దళాలమాదిరిగా, ఊరల్సు-క్యుస్నెట్స్కి పారిశ్రామిక కేంద్రం యితర పరిశ్రమలకు రిజర్వుగా ఉపయోగపడుతూంది. కార్మికులుగా పనిచేసే లక్షలాది స్త్రీ, పురుషులకీ రహస్యం తెలుసు. కనుకనే వారుఅద్వితీయమైన ఉత్సాహంతో రాత్రింబగళ్లు పనిచేస్తున్నారు. ఫాసిస్టు సైన్యాలకు రష్యాలో సమాధులు కట్టడానికి, వీరు ఊరల్స్-క్యుస్నెట్స్కి పారిశ్రామిక కేంద్రంలో తమ శక్తినంతా ధారపోస్తున్నారు.

[ఈ వ్యాసం మారిస్ ఎడెల్మన్‌చే రచించబడిన "ఊరల్స్ వెనుక సోవియట్ యూనియన్" అనే గ్రంథంలో ఒక అధ్యాయాన్ననుసరించి వ్రాయబడింది.]

లేలేలే రష్యా ★ శ్రీ. శ్రీ.

గర్జించు రష్యా
గాండ్రించు రష్యా
పర్జన్య శంఖం పూరించు రష్యా
దౌర్జన్య రాజ్యం ధ్వంసించు రష్యా
లేలే రష్యా
రారా రష్యా

వ్యక్తి స్వతస్సిద్ధ స్వాతంత్ర్యదాతా
పతిత నిర్గతిక ప్రపంచత్రాతా
భావికాల స్వర్ణభవన నిర్మాతా
లేలే రష్యా
రారా రష్యా

పుష్కిన్, గోగోల్, షెకోవ్, టాల్‌స్టాయ్
డోస్టోవ్‌స్కీ, గోర్కీ, కూప్రిన్
శిల్పసామ్రాట్టులై
జీవితం మథియించి
పాపపంకంనుంచి పద్మాలుపుట్టించి
కార్మికస్వర్గాన్ని కలగన్న రష్యా
లేలే రష్యా
రారా రష్యా

మార్క్సు, ఎంగెల్సు,
భావాల కోలాహలం
లెనిన్ లక్ష్యం
స్టాలిన్ సేద్యం
జ్వలించిన ఫలించిన సముజ్జ్వలతేజం
యునైటెడ్ సోవియట్ సోషలిస్ట్ రాజ్యం
స్వాతంత్ర్య శత్రువుల గుండెల్లో బల్లెం
పరపీడనాపరుల ప్రాణాలభైరవి
లే లే లే రష్యా
రా రా రా రష్యా

ఈ అగ్నివర్షాలు
ఈ రక్తపాతాలు
ఎలాగూవచ్చాయి ఏమయితేకానీ,
సామ్యవాదంతో సమసిపోతాయి
ఈ సవనరంగంలో ఎగరనీ జీవాలు
ఈ సమరం తుదిచూడండే
ఇక నిలిచిపోరాదు
తిరుగులేని ప్రతిజ్ఞ తీసుకో రష్యా
లేలే రష్యా
రారా రష్యా

ఫాసిస్టుకూటాలు కట్టుకడుతున్నాయి
కుట్రలూ కుహకం చెలరేగుతున్నాయి
అసత్యప్రచారపు రేడియోబాకా
రాజకీయాలలో రంకువేషాలు
మరఫిరంగులుతెచ్చి మందిచ్చి రష్యా
విమానబాహువులు విసురుతూ రష్యా
అనంతప్రపంచం అంతటా నీపై
నీగొడుగునీడల్ని సారించు రష్యా
స్వతంత్రత సమానత సాధించు రష్యా
లేలే రష్యా
రారా రష్యా

సుప్తకంకాళాలు మేలుకుంటున్నాయి
ప్రపంచం పడగెత్తి బుసకొట్టి లేచింది
కార్మికులు కర్షకులు తాడితులు పీడితులు
కెరటాలుగా పొంగి తిరగబడుతున్నారు
ప్రపంచం నీకోసం పరిపక్వంగా ఉంది
కోటిగొంతులు నిన్ను కోరి రమ్మన్నాయి
కోటిచేతులు నిన్ను కౌగిలిస్తున్నాయి
సైం అంటు రష్యా
హై అంటు రష్యా
లే లే లే రష్యా
రా రా రా రష్యా

సోవియట్ రష్యాలో

జాతీయఐక్యత నెలాసాధించారు ?

కామ్రేడ్ సజ్జాద్ జహీర్

సోవియట్ రష్యాలో ప్రజ లింత కాలంనుంచి హిట్లర్ సేనలతో యెలా పోరాడగల్గుతున్నారు? అంగ బలం, అర్థ బలం, ఆయుధ బలం విషయంలో నాజీ సేనలకంటె రెడ్‌ఆర్మీ తీసిపోయినప్పటికీ ఇంత దీర్ఘకాలం యెలా శత్రువు నెదుర్కొంటూ నిలబడ గలిగారు? ఈ ప్రశ్నలకు జవాబు అనేక ప్రజలకు తెలియదు. కమ్యూనిస్టులకు మాత్ర మిందులో ఆశ్చర్యం లేదు.

గత 24 సంవత్సరాల కృషి ఫలితంగా కమ్యూనిస్టుల పరిపాలనలో ఒక కొత్త మానవజాతి, ఒక కొత్త నాగరికత సృష్టించబడిందనే విషయాన్ని అనేకులు తెలుసుకోలేకున్నారు.

మానవుని కల్పనాశక్తి రష్యాలో అభివృద్ధి చెందినంత యెక్కువగా మరే దేశంలోను యెప్పుడూ అభివృద్ధి చెందలేదు. ఇంత స్వేచ్ఛగాను, యింత క్రమ శిక్షణతోను, వికసించే హృదయాలు యెక్కడా లేవు. సామాజిక జీవితంలో యింత ఔన్నత్యం, యింత వికాసం యెక్కడా, యెవరూ పొందలేదు. అద్భుతమైన ఈ మార్పును, అపూర్వమైన యీ నూతన జీవితాన్ని, అర్థం చేసుకోక, ప్రజలు విస్మయంలో పడుతున్నారు. శిథిలమవుతూన్న ఫాసిజానికీ - దిన దినాభివృద్ధి చెందుతూన్న సోవియట్ విధానానికీ మధ్య జరుగుతోంది యీ సంఘర్షణ. ఈ రెండిటి లక్షణాలు పరస్పర విరుద్ధమైనట్టివి. అంతేగాని అనుభవంలోను, ఆయుధ సంపత్తిలోను యెక్కువ తక్కువ బలాలకు సంఘర్షణ మాత్రమేకాదు.

జీవితంయొక్క అనేక శాఖలలో యీ మార్పు తీసుకురాబడింది. ఈ వ్యాసంలో ప్రధానమైన ఒక శాఖను గురించి వ్రాస్తాను. రష్యాలో అసంఖ్యాకమైన వేర్వేరు జాతులు, చిన్నవి - పెద్దవి, ఏవిధంగా అద్వితీయమైన ఐక్యతతో ముందుకు సాగిపోతున్నాయో, ఏ విధంగా ఈ ఐక్యత హిట్లరు సేనలను ఎదతెగకుండా ఎదుర్కోవడంలో బలమైన పునాదిగా వుందో, ఈ వ్యాసంలో ఉదాహరిస్తాను.

జారుచక్రవర్తి పరిపాలనలో

1917 లో జరిగిన రష్యావిప్లవానికి పూర్వం ఈ వేర్వేరుజాతులు జారుచక్రవర్తి యొక్క సామ్రాజ్యంలో భాగాలుగా వుండేవి. రష్యాజాతికి చెందిన జమీందార్లు — పెట్టుబడిదార్లు జార్ చక్రవర్తి సహకారంతో యితరజాతుల ప్రజల్ని నిర్దాక్షిణ్యంగా హింసిస్తూ వుండేవారు. రాజకీయంగాను, ఆర్థికంగాను, విజ్ఞానవిషయంలోను, యీజాతుల ప్రజలు అధోగతిపాలయారు. ఈ బానిసజాతులకు ప్రజాతంత్ర హక్కులు, స్వపరిపాలనా సంస్థలు, పూర్తిగా నిరాకరించబడ్డాయి. జాతీయోద్యమం యొక్క చిహ్నాలెక్కడ కనబడినా, వాటిని దారుణమైన రాక్షసపద్ధతులతో అణచివేసేవారు. ఉదాహరణకు, ప్రాచీనజాతికి చెందిన పోల్ ప్రజలు తమ జాతీయ స్వాతంత్ర్యం కొరకు పోరాటం సాగించినప్పుడల్లా మిలిటరీని పంపించి, ప్రజల్ని రక్తపాతంలో ముంచేవారు. పోల్‌జాతి ప్రజల భూముల్ని జప్తుచేసి రష్యన్ భూస్వాములకిచ్చేవారు. వందలకొద్దీ పోల్సును, వారి నాయకుల్ని, తుపాకులకు గురిచేసి హత్యచేసేవారు. భయంకరమైన రాక్షసపరిపాలన వారి రాష్ట్రంలో నిరంతరం తాండవమాడుతూం[illegible]దేది. పోలిష్‌భాషను పూర్తిగా నాశనంచెయ్యాలని ప్రభుత్వాధికారులు దీక్ష పూనారు. ఆ భాషను పిల్లలకు నేర్పకూడదు. కోర్టులలో వాడకూడదు. పోలిష్‌భాషలో పత్రికలు, పుస్తకాలు అచ్చు వేయకూడదు. అందరూ రష్యన్ భాషనే వాడాలి.

కాకేసస్‌జాతి ప్రజలగతి కూడా యింతే. జారుచక్రవర్తియొక్క దుర్మార్గాలు భరించలేక, వీరు కాకేసస్ పర్వతాలకు వెళ్ళిపోయేవారు. తమ భూముల్ని, పశువుల్ని, రష్యన్ దోపిడీగాండ్రకు బలిచేసేవారు. అనేకసార్లు వీరు ఆయుధాలతో తిరుగుబాటు చేశారు. కాని ప్రతి తిరుగుబాటును మిలిటరీ అణచివేసి, వేలకొద్దీ ప్రజల్ని హత్యచేసింది.

విభజించి పరిపాలించేనీతి

తమ శత్రువులను బలహీనపరచడానికి రష్యన్ పరిపాలకవర్గం విభజించి పరిపాలించే నీతిని ఆచరణలో పెట్టేవారు. అజర్‌బైజానియన్ జాతిపై జార్జియన్లను, ఆర్మీనియన్లపై అజరుబైజానియన్లను, ఉజ్బెక్‌జాతిపై కిర్ఘీజ్ జాతిని, తాజీక్‌లపై ఉజ్బెక్‌లను, ఉసిగొల్పి కలహాలు ప్రోత్సహించేవారు. ఒకరిపై మరొకరు పోట్లాడుకొంటూంటే జారుచక్రవర్తి యొక్క పోలీసులు, మిలిటరీ వచ్చి తుపాకులు కాల్చేవారు. ఈ విధంగా తమ అధికారాన్ని శాశ్వతంగా నిలుపుకొనేవారు. యూదుజాతి ప్రజలసంగతి చెప్పనే అక్కర్లేదు. రష్యా సామ్రాజ్యంలో వీరెక్కడికెళితే అక్కడ హింసించబడి మరొక స్థలానికి తరుమబడేవారు. ఊరికి బయట వీరు నివసించాలి. ప్రభుత్వోద్యోగాలు వీరికి నిషేధం. స్కూళ్ళలోను విశ్వవిద్యాలయాలలోను ప్రభుత్వంచే విధించబడిన సంఖ్యకంటె అదనంగా చేర్చుకోరు. భూములు కొనుక్కోవడానికి వీరి కర్హతలేదు. ఇది చాలక రష్యన్ భూస్వాములు, జమీందార్లు యూదులపై రౌడీలను పురిగొల్పి, దోపిడీ చేయించేవారు. వారియిండ్లకునిప్పంటించేవారు. యూదుజాతి స్త్రీ పురుషుల్ని, బాల బాలికలను, నిర్దాక్షిణ్యంగా చిత్రవధలకు, ఖూనీలకు, గురిచేసేవారు. ఈవిధంగా రష్యన్‌జాతి యొక్క ప్రజాసామాన్యంలో విప్లవ చైతన్యం కలుగకుండా, వారి అసంతృప్తిని యీఉపజాతి ప్రజలపై తప్పుడు మార్గంలో నడిపించేవారు.

విజ్ఞానం శూన్యం

రష్యన్ సామ్రాజ్యంలో వున్న ప్రత్యేక జాతులకు జార్ పరిపాలన విజ్ఞానాభివృద్ధికి అవకాశాలివ్వకపోగా, ఉన్న విజ్ఞాన సంపదను నాశనం చేయడానికే ప్రయత్నాలు గావించినది. ఒకవైపు రష్యన్ భాష, రష్యన్ పద్ధతులు, నిర్బంధంగా అమలు జరుపబడేవి. మరొకవైపు ఆయా జాతుల కళలు, సారస్వతము, భాష మొదలైనవి బుద్ధిపూర్వకంగా వెనుకకు నెట్టబడేవి. ప్రజలలో అవిద్య, అజ్ఞానం, విపరీతంగా వ్యాపించాయి. ప్రభుత్వం అనేక మూఢవిశ్వాసాలను ప్రోత్సహించి ప్రజలలో చైతన్యం భయల్దేరకుండా ఆటంకపరిచేది.

నవంబరు విప్లవం

ఇదంతా చూచిన తర్వాతే లెనిన్, జారిష్టు రష్యా జాతుల జైలు అని, అందులో వున్న వివిధ జాతులు ఖైదీలని వర్ణించాడు.

1917 నవంబరులో జరిగిన విప్లవం ఈపరిస్థితులన్నింటినీ తారుమారుచేసింది. రష్యన్ కార్మికవర్గం కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన జమీందారులయొక్క, పెట్టుబడిదారులయొక్క, పెత్తనాన్ని పూర్తిగా నిర్మూలించి, అత్యున్నతమైన ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని నెలకొల్పింది. ఇదే సోవియట్ పరిపాలన. జార్ యొక్క దుష్పరిపాలన ఇంతటితో అంతమయింది. ఇదే సమయాన ఆ చక్రవర్తి పరిపాలనలో యమబాధ లనుభవించిన పీడిత జాతులకు నూతన ప్రభుత్వం సోదర భావంతో స్వాగతమిచ్చింది. సోవియట్ యూనియన్‌లో నివశించే ప్రజలందరు సమాన హోదాలో స్వాతంత్ర్య మనుభవించవచ్చునని స్పష్టమైన భాషలో ప్రకటించింది. వివిధజాతుల దోషిడీని పూర్తిగా నిర్మూలించింది. విప్లవానంతరం లెనిన్-స్టాలిన్‌ల సంయుక్త ప్రకటనలో ఈక్రింది సూత్రాలు వెల్లడిచేయబడ్డాయి.

1. సోవియట్ రష్యాలో ప్రజలకు సమాన హక్కులు, సంపూర్ణ స్వాతంత్ర్యం వుంటాయి.


2. రష్యన్ ప్రజలందరు స్వయం నిర్ణయ హక్కును కలిగి యుంటారు. సోవియట్ యూనియన్‌లో నుంచి విడిపోయి, మరొక ప్రభుత్వాన్ని స్థాపించుకోవడానికి కూడా హక్కును కలిగి యుంటారు.

3. ప్రత్యేక జాతులకు, మతాలకు ప్రత్యేక సౌకర్యాలు, హక్కులు ఉండవు.

4. అల్పసంఖ్యాక జాతులకు, భాషాప్రయుక్త ముతాలకు, ప్రత్యేకాభివృద్ధికి అన్ని అవకాశాలు కల్పించబడతాయి.

ముస్లిం ప్రజలకు లెనిన్ హెచ్చరిక

సోవియట్ ప్రభుత్వం తరపున లెనిన్ రష్యాలో వేర్వేరు జాతులుగా నివసించే ముస్లిం ప్రజలకు యీ క్రింది విధంగా హెచ్చరిక గావించాడు.



" రష్యాలో నివసించే మహమ్మదీయులారా! వోల్గా, క్రిమియా ప్రాంతాలలో నివసించే టార్టార్ ప్రజలారా! సైబీరియా, టర్కిస్థాన్‌లలోని కిర్ఘీజ్, సార్టీ జాతుల ప్రజలారా! ట్రాన్స్ కాకేషియాలో నివసించు తురుష్క, టార్టార్ ప్రజలారా! మీ ఆచారాలు, సాంప్రదాయాలు, మీజాతీయ సంస్థలు, విజ్ఞానం, యికనుంచి స్వేచ్ఛగా వికసించగలవు. ఎవరూ వాటిలో యికమీదట్యం కల్గించుకోరు. వాటిపై మీకు సంపూర్ణమైన హక్కువుంది. సోవియట్ ప్రభుత్వం మీ హక్కుల్ని కాపాడుతుందని నమ్మండి. మీ హక్కులు మాత్రమే కాదు. రష్యాలో నివసించే వేర్వేరు జాతులందరి హక్కులు కాపాడబడతాయి. కాబట్టి, మీరు విప్లవాన్ని సోవియట్ ప్రభుత్వాన్ని, బలపరచి సహాయం చేయండి."

స్వతంత్ర రిపబ్లిక్సు యొక్క ఫెడరేషన్

ప్రజ లెవరినీ, యేజాతినీ, పీడించడంగానీ, దాసత్వంలో ఉంచడం గాని, కార్మికవర్గం యొక్క శ్రేయస్సుకు విరుద్ధం కనుకనే అది వివిధజాతుల సంపూర్ణస్వాతంత్ర్యాన్ని, సమాన హోదాను, గుర్తించింది. అయితే కొత్తగా లభించిన యీ హక్కును దొంగిలించడానికి రాష్యా బయట, రష్యా లోపలకూడా, శత్రువు లుండేవారు. ప్రజల్ని కొల్లగొట్టి తమ వర్గ శ్రేయస్సుకై రష్యాను విదేశీ సామ్రాజ్యవాదుల కమ్మివేయడానికి సిద్ధపడిన జమీందారులు ఒకవైపున, జారు చక్రవర్తి యొక్క సామ్రాజ్యం నాశన మయినప్పటికీ, రష్యాను చిన్న చిన్న భాగాలుగా చీల్చి, తమ సామ్రాజ్యంలో కలుపుకుందామని ఆశించే వేర్వేరు సామ్రాజ్యవాదులు మరొకవైపున, కలిసి కుట్రలు ప్రారంభించారు. కొత్తగా స్వయం నిర్ణయహక్కును సంపాదించుకున్న వివిధ జాతుల ప్రజలయెదుట రెండేమార్గా లున్నాయి. ఒకటి: అధికారంలో వున్న రష్యన్ కార్మిక వర్గంతో చేయి, చేయి కలిపి, దేశంలో వున్న విద్రోహుల్నీ, దేశం బయటవున్న సామ్రాజ్యవాదుల్నీ చెండాడడం. లేదా, తిరిగి పూర్వం మాదిరిగానే సామ్రాజ్యవాదుల నరక కూపములో బడి భస్మం కావడం. ఉక్రెయిన్, కాకేషియా, మధ్య ఏషియా, ఫిన్లెండ్, బాల్టిక్ రాజ్యాలలోను, ఇతర ప్రాంతాలలోను యిట్టి విద్రోహ కుట్రలు, అంతర్యుద్ధాలు విరివిగా చెలరేగాయి. చివరకు ఫిన్లెండు, పోలెండు, బాల్టిక్ రాజ్యాలలో తప్ప మిగతా ప్రదేశాలలో సోవియట్ ప్రభుత్వమే విజయం సంపాదించింది. 1922 లో స్వతంత్ర సోవియటు సోషలిస్టు రిపబ్లిక్సుయొక్క ఫెడరేషన్ యేర్పడింది.

జాతీయఐక్యత

ఈ ఫెడరేషన్‌లో చేరిన వివిధ జాతులు తమ కెప్పుడు ఇష్టంలేకపోతే అప్పుడు విడిపోవడానికి గల హక్కు రద్దు చేయబడలేదు.

ఈ విధంగా స్వాతంత్ర్యం కలిగిన ప్రత్యేక జాతుల ప్రజలు తమ సమిష్టి శ్రేయస్సుకై ఐకమత్యాన్ని పెంపొందించుకున్నారు. విదేశీ సామ్రాజ్యవాదులు, దేశీయ విద్రోహులు, కలిసి గావించిన కుట్రలను భగ్నం గావించడానికి అన్ని జాతుల ప్రజలు కలిసి పోరాడారు. ఈ పోరాటం ద్వారా యేర్పడిన ఐక్యత శాశ్వతంగా నిలిచిపోయింది. స్వతంత్ర రిపబ్లిక్కులన్నీ భవిష్యత్తులో భద్రంగా కాపాడబడాలంటే, సోషలిస్టు విధానం సురక్షితంగా రక్షించబడాలంటే, ప్రత్యేక జాతుల మధ్య ఐక్యత యెలా అవసరమో ఆయా ప్రజలు గ్రహించారు. ఇంతేకాదు; అంతర్యుద్ధంవల్ల దేశంలో యేర్పడిన ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించి శాంతిని కాపాడటానికి కూడా జాతీయైక్యత యెలాఅవసరమో తమ స్వానుభవం ద్వారా తెలుసుకున్నారు. సోవియటు ప్రభుత్వాన్ని సోషలిస్టు పునాదులపై జయప్రదంగా నిర్మించడానికి ఐక్యత యొక్క అవసరమెంతో వారు గుర్తించారు........

వలస దేశాలకు సోవియట్ ప్రభుత్వ సహాయం

ఇదివరలో జార్ చక్రవర్తి పరిపాలన క్రింద యమబాధలు పడిన పీడిత జాతుల ప్రజలు కార్మిక ప్రభుత్వానికీ, పూర్వపు జార్ చక్రవర్తి పరిపాలనకూ, యెట్టి పోలిక లేదను యదార్థాన్ని తెలుసుకొన్నారు. వలసదేశాల ప్రజలను సోవియట్ ప్రభుత్వం ప్రత్యక్షంగాగాని, పీడించేది కాదనీ, పైగా అన్నివిధాల వారి స్వాతంత్ర్యోద్యమానికి సహాయం చేస్తుందనీ, నిజమైన ప్రజాస్వామ్య హక్కులు, ప్రజా పరిపాలన, వారిలో పెంపొందింపజేస్తుందనీ, తెలుసుకున్నారు. ఒక్కరష్యా సరిహద్దులలోనేగాక, బయటకూడా పీడిత ప్రజల స్వాతంత్ర్యోద్యమానికి సోవియట్ ప్రభుత్వం సహాయం చేసింది. ఉదాహరణకు, కెమాల్‌పాషా నాయకత్వంక్రింద టర్కీకి, సన్‌యట్‌సేన్ నాయకత్వం క్రింద చైనాకు, అమనుల్లా నాయకత్వం క్రింద ఆఫ్ఘనిస్తాన్‌కు, సోవియట్ ప్రభుత్వం, అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీ ప్రత్యక్ష సహాయంచేసి, ఆయా దేశాల స్వాతంత్ర్య పోరాటాలకు బలం యిచ్చాయి

ప్రత్యేకజాతుల హక్కులు

సోవియట్‌రష్యాలో ప్రత్యేకజాతుల కేయే హక్కులున్నాయో తెలియజేస్తూ కొన్ని ప్రధాన సిద్ధాంతాలు రష్యన్ రాజ్యాంగప్రణాళికలో ప్రకటించబడ్డాయి. అందలి 17 వ నిబంధన ప్రకారం, ఫెడరేషన్‌లో చేరిన ప్రతిరిపబ్లిక్కు యిష్టంలేకపోతే విడిపోయే హక్కును కలిగియుంటుంది. 18 వ నిబంధన ప్రకారం ఏ రిపబ్లిక్కుయొక్క సరిహద్దులైనా మార్చవలసివస్తే, ఆ ప్రజల అంగీకారం తీసుకోవాలి. 123 వ నిబంధన ప్రకారం, సోవియట్‌యూనియన్‌లో నివసించే ప్రజలందరికీ సమాన హక్కు లీయబడతాయి; ఒక జాతికి ఎక్కువ హక్కులు, మరొక జాతికి తక్కువ హక్కులు ఉండవు. వేర్వేరు జాతులమధ్య విచక్షణ, చూపినవారిపై కఠినచర్య తీసుకుంటారు. ఒకజాతిపై మరొకజాతిని రెచ్చగొట్టడంగాని, అన్యోన్య వైషమ్యాలు పురిగొల్పడంగాని, చేస్తేకూడా నేరంగా పరిగణించబడుతుంది. సోవియట్ యూనియన్‌కంతటికీ శాసన నిర్మాణాధికారం, కార్యనిర్వహణాధికారం రెండు సభల సంయుక్తసమావేశానికి ఉంది. ఒకటి, అఖిలయూనియన్ సోవియట్ మహాసభ, రెండు ప్రత్యేకజాతుల సోవియట్ మహాసభ. ఈ రెండవ సభకు దేశంలో వున్న 21 వివిధజాతుల నుండి ప్రజలు తమ ప్రతినిధులను పంపుతారు. ఒక్కొక్క జాతి 25 గురు ప్రతినిధుల్ని పంపాలి. ఎంతచిన్న రిపబ్లిక్కయినా, ఎంత పెద్ద రిపబ్లిక్కయినా, 25 గురు చొప్పునే పంపాలి. దీని అర్థం, చిన్నజాతులు పెద్ద జాతులలో సమానహోదాను కలిగియున్నవన్నమాట. సోవియట్ యూనియన్‌లో 21 రిపబ్లిక్కులేగాక, చిన్నచిన్న అటానమస్ రిపబ్లిక్కులు, అటానమస్ రీజియన్లు, నేషనల్ ఏరియాస్, అనే పేర్లతో పిలువబడు ప్రత్యేక జాతులు కూడా వున్నాయి. వీటన్నిటికీ స్థానిక సమస్యలపై సంపూర్ణాధికారం వుంటుంది. తమతమ ప్రతినిధులను ప్రతేక జాతుల సోవియట్ మహాసభకు పంపుకుంటాయి.

స్టాలిన్ ఉపన్యాసం

ఈ కొత్త మానవజాతిని నిర్మించి నడుపుతూన్న కామ్రేడ్ స్టాలిన్ యిలా ఉపన్యసించాడు :—

"....వివిధజాతులమధ్య వైషమ్యాలు పురిగొల్పేది జమీందారులు, పెట్టుబడిదారులవంటి పీడించే వర్గాలు. నేడు రష్యాలో వారు లేరు. వేర్వేరు జాతుల ప్రజలలో అన్యోన్య ద్వేషభావం పెరగడానికి కారణం దోపిడీవిధానం. అది నేడు రష్యాలో నిర్మూలించబడింది. రాజ్యాంగాధికారం కార్మికవర్గపు చేతుల్లో ఉంది. ఈ వర్గం బానిస జీవితాన్ని కూకటివేళ్ళతో నాశనంచెయ్యాలంటుంది. అంతర్జాతీయ సౌభ్రాతృత్వమే దీని ప్రధాన సూత్రం. ఆర్థిక-సామాజిక జీవితంలో ప్రతి అంశంలోను అన్యోన్యసహకారంతో మెలగడమే కార్మికవర్గానికి కావలసింది. సోవియట్ యూనియన్‌లో నివసించే ప్రజలందరి జాతీయ విజ్ఞానం వికసించేటట్లు ప్రోత్సహించడం దాని ప్రధాన కార్యక్రమం.

ఈ మార్పులన్నీ సోవియట్ యూనియన్‌లో నివసించే ప్రజల పద్ధతులను తారుమారు చేశాయి. వారిలో ఉండే అన్యోన్య ద్వేషాలు నశించాయి. వారిలో పరస్పర మిత్రభావం వృద్ధిచెందింది. ఈ విధంగా, ఒకే ఫెడరల్ రాజ్యాంగంలో ప్రజల మధ్య పరస్పర సహకారం, అన్యోన్య సౌభ్రాతృత్వం, యేర్పడ్డాయి."

ప్రజల ఔన్నత్యం

సోవియట్ ప్రభుత్వంయొక్క యీ విధానం వల్ల ఫలితాలేమిటి? ప్రపంచంలో యేదేశము ఎరుగనంతటి జాతీయౌన్నత్యం, వైజ్ఞానిక సంపద, సోవియట్‌ప్రజ లనుభవిస్తున్నారు. కొత్తకొత్త పరిశ్రమలెన్నో స్థాపించబడ్డాయి. వ్యవసాయంలో నవీనమార్గాలు అమలులో పెట్టబడ్డాయి. కొత్తపంట లెన్నో పండిస్తున్నారు. స్త్రీల బానిసత్వం నిర్మూలించబడింది. ప్రతి రిపబ్లిక్‌లోను ప్రాథమిక విద్య ఉచితంగాను, నిర్బంధంగాను నేర్పబడుతోంది. విశ్వవిద్యాలయాలు, శాస్త్ర పరిశోధనాలయాలు, ఎన్నో నిర్మించబడ్డాయి. సారస్వతం, సంగీతం, నాట్యకళ, సినీమా, వ్యాయామ క్రీడలు అద్భుతమైన వికాసం చెందాయి. సైబీరియా ప్రాంతపు టండ్రా ప్రదేశాలలోను, మధ్య యేషియాలోని వెనుకబడిన రాష్ట్రాలలోను, కాకేషియన్ పర్వత ప్రాంతాలలోను, ప్రజల విజ్ఞానం అభివృద్ధి చెందింది. ఉజ్బేక్ ప్రజలు, తాజీక్ నివాసులు, కిర్ఘిజ్ జాతివారు, టర్కోమానులు, టార్టార్‌లు, అనగా సోవియటు రష్యాలో నివసించే మహమ్మదీయ ప్రజలు, పొందిన నూతన వికాసం యే ఆసియా నివాసినైనా ఉప్పొంగేటట్లు చేస్తుంది. బలిష్ఠమయిన యీ జాతులన్నీ అధోగతిపాలు కాకుండా రక్షించబడ్డాయి. జీవితంలో వీరు సర్వతోముఖమైన అభివృద్ధిని గాంచుతున్నారు. టార్టార్ రిపబ్లిక్‌లో జంబూల్‌అనేప్రసిద్ధ కవీశ్వరుడు, దఘీస్తాన్‌లో సులేమాన్ అనే కవి, తమ తమ భాషలలో యీ నూతన వికాసాన్ని గురించి గేయాలు పాడుతారు. ప్రఖ్యాతి గాంచిన సారస్వత నిర్మాత లింకా యెంతోమంది వివిధ జాతుల ప్రజలలో ఉత్తేజం ఉట్టిపడే భాషలో అనేక గ్రంథాలు వ్రాస్తున్నారు. సోవియటు రష్యాలో యేర్పడిన కొత్త నాగరికతను వీరు ప్రతిబింబిస్తున్నారు.

నేర్చుకోవలసిన పాఠం

నేడు జరుగుతూన్న రష్యా - జర్మనీ యుద్ధములో ఫాసిస్టు రాక్షసుల్ని నాశనం గావించడానికి సోవియట్ యూనియన్‌లో నివసించే ప్రతి జాతి ప్రజలు ఐక్యతతో పోరాడుతున్నారు. అందరికీ సమాన శత్రువైన ఫాసిజం రష్యాపై దాడిచేసినప్పుడు స్వతంత్ర రిపబ్లిక్‌లలో నివసించే ప్రజలు జాతీయైక్యత యొక్క అవసరాన్ని గుర్తించి, సంఘీభావంతో పోరు సల్పుతున్నారు. ఈరోజున సోవియట్ రష్యాకు సంభవించిన ప్రమాదమే మన దేశానికి కూడా సంభవించేటట్లుంది. ఈ పరిస్థితులలో మనం సోవియట్ యూనియన్ నుండి ఒక చక్కని పాఠం నేర్చుకొనగలం. మన దేశంలో నివసించే ప్రత్యేక జాతుల స్వయంనిర్ణయ హక్కును, సమాన హోదాను, గుర్తించి, ఆ పునాదులపై జాతీయైక్యత అనే సౌధాన్ని నిర్మించాలి. అప్పుడు భారతీయు లందరికీ సమాన శత్రువైన ఫాసిజాన్ని సంఘీభావంతో యెదిరించి నాశనం చేయాలి. ఈ ఐక్య పోరాటంలో జయంపొంది, స్వాతంత్ర్యం సంపాదించిన తరువాతకూడా ప్రజా తంత్ర హక్కులను కలిగియుండే ప్రత్యేకజాతుల ఫెడరేషన్‌యేర్పర్చాలి.

విజయకంకణానికి కార్మికవీరుల అఖండత్యాగం

(4 వ పేజీ తరువాయి) లోనే పూర్వంకంటె వేగంగా పనిచేయసాగాయి. ఖార్కోవ్‌నుంచి ఒకే ఒక ట్రాక్టరు యంత్రాగారాన్ని సమారా ప్రదేశానికి తీసుకెళ్ళినపుడు 7000 రైల్వే వేగన్లు అవసరమయాయంటే, సోవియటు కార్మికులెంత పట్టుదలతో విజయం కొరకు కృషిచేస్తున్నారో స్పష్టపడుతుంది నాజీలు ఉక్రెయిన్ ప్రవేశించబోయే సమయంలో అక్కడి పరిశ్రమలన్నీ తూర్పుదిశకు రవానా చేయబడినప్పుడు ప్రతిరోజు 80,000 రైల్వే వేగన్లు చొప్పున వెళ్ళుతూ ఉండేవట. యుద్ధానికి పూర్వం సోవియటు రష్యా అంతటిలోను రోజు 1కి 80,000 వేగన్లు చొప్పున ప్రయాణం చేసేవి. ఆ రోజులలో రోజుకు యిన్ని వేగన్లు ప్రపంచంలో ఏదేశంలోను ప్రయాణం చేసేవికాదు.

స్టాలిన్‌గ్రాడ్ రంగంలో పోరుసల్పే సోవియట్ సైనికులెన్ని త్యాగాలు చేస్తున్నారో, రైల్వే కార్మికులుకూడా యీ విధంగా వారితో సమానమైన త్యాగాలు చేస్తున్నారు.

బోరిస్ అగపోవ్ అనే పత్రికా విలేఖరి బ్రహ్మాండమైన ఒక యంత్రాగారం రవానా చేయబడుతుండే స్వయంగాచూచి, మాస్కో న్యూస్ పత్రికలో వర్ణించాడు. మంచుతో కూడిన ఒక మహాసముద్రం మధ్య పెద్దపట్టణమొకటి విపరీతమైన వేగంతో ప్రయాణంచేస్తే యెలావుంటుందో అలా కనపడిందినాకు. ఒక స్టేషన్ యెదుట అది ఆగింది. తక్షణమే కొన్ని వేలమంది కార్మికులు, అనేకయంత్రాలు రైళ్ళోనుంచి కిందికి దిగారు. సామగ్రినంతటినీ కార్మికులు 3 రోజులలో క్రిందికి దింపాలి. ఎందువల్లనంటే, వేగన్లు మరొకచోటకు తక్షణమే వెళ్ళిపోవాలి. అనేకవందల మైళ్ళు ప్రయాణంచేసి వచ్చిన ఆ కార్మికులు, దిగిన వెంటనే విశ్రాంతి అయినా తీసుకొనకుండా, ఆ మంచుగడ్డలపై దుమికి పని ప్రారభించారు, దక్షిణదేశ వాసులైన వీరి ముఖాలలో విపరీతమైన చలిగాలి వీచుతూన్నప్పటికీ, పళ్ళు బిగించి, అతి పట్టుదలతో తమ నియమిత కార్యాలను నెరవేర్చారు.

వీరు నివసించడానికి యిండ్లు యింకా ఏర్పాటు కానేలేదు. ఇంత మంచులో పని చెయ్యడాని కవసరమైన వెచ్చని దుస్తులులేవు. ఇంతింతబరువుగలయంత్రాలను బయటికి తీయడానికి క్రేన్లుకూడాలేవు. అయినప్పటికీ, డైరెక్టరు మొదలు కార్మికుల భార్యలవరకు అంతా ఉత్సాహంతో పనికి దిగారు. కార్మికులందరికీ నాయకుడైన ఒక కామ్రేడ్ పట్టణంలోకి పోయి ఆహారపదార్థాలకొరకు సన్నాహాలు చేస్తూంటే, మరొకవైపున కార్మికులు వంచిన తల యెత్తకుండా యంత్రాలన్నీ క్రిందికి దింపుతున్నారు. 3 రోజుల్లో వాటిని క్రిందికి దింపి, వీటి నిర్మాణానికి సిద్ధంగావున్న బిల్డింగులలో అతిశీఘ్రంగా చేర్చారు. వాటిపై వ్యాపించిన మంచుబిందువుల్ని పరిశుభ్రమైన గుడ్డలతో కార్మికులు అతిసున్నితంగా వొత్తిబాగుచేశారు. త్వరలోనే ఆ యంత్రాలన్నీ ఎలెక్ట్రిక్‌పవరు సహాయంతో తిరగడం ప్రారంభించాయి. ఒక వైపున 24 గంటలూ యంత్రాలు తిరుగుతూ, పనిముట్లు తయారౌతూంటే, మరొక వైపు నుంచి బిల్డింగుయొక్క పైకప్పు, కిటికీలు, వగైరా యేర్పాట్లన్నీ జరిగిపోయాయి.

దేశంలో ప్రసిద్ధిచెందిన ఇంజనీరింగ్ నిపుణులు, శాస్త్రపరిశోధకులు, యిచటికివచ్చి బిల్డింగులను అతివేగంగాను, సులభంగాను, నిర్మించే పద్ధతులు బోధించారు. ముడి సరకు పాడుకాకుండా ఉపయోగించడం, ఒక్క నిమిషంకూడా వృథాచేయకుండా కాలాన్నంతటినీ వినియోగించడం, యెలాగో కార్మికులకు బోధించబడేవి. ఉదాహరణ : సైబీరియాకు ట్రాన్సుఫరుచేయబడిన ఒక పరిశ్రమాలయం, 2 బిల్డింగులలో నిర్మించబడాలి, వాటికి 10,000 చదరపు మీటర్ల స్థలమవసరము. కాని, శాస్త్రపరిశోధకుల సహాయంతో ఒక్కొక్కటి 100 మీటర్ల పొడవు, 50 మీటర్ల వెడల్పుగల రెండు బిల్డింగులు సరిపోయేటట్లు చేశారు. వీటిని నిర్మించడానికి 12 రోజులు మాత్రమే పట్టింది. ప్రతి కార్మికుడు తన యెదుటవున్న యంత్రంచే ఎంత యెక్కువ పనిని ఎంత సులభంగా చేయించగలడో అంత యెక్కువపనిని అంతసులభంగా, చేయిస్తాడు.

కొబట్టి యుద్ధరంగంలో ప్రాణాలర్పించుతూన్న సోవియటు సైనికుల మాదిరిగానే కార్మికులుకూడా ఉత్పత్తి యెక్కువ చేయడంలో అవసరమైతే తమప్రాణా లర్పించడానికి తయారయ్యారు.

రైల్వే కార్మికుల కడగండ్లు

సరిగా తిండి ఉంటేనే గాని శ్రమజీవి బాగా పని చేయలేడు. బాగా పనిజేస్తేనేగాని అధికంగా ఉత్పత్తి ఉండదు. అధికోత్పత్తి ఉంటేనేగాని ఫాసిస్టు నరహంతకుల్ని జయించటానికి సాధ్యపడదు - కార్మికుల యుద్ధ భత్యపు కోర్కెయొక్క అంతరార్థం ఇది.


అలవెన్సా ? దొంగదోపిడా ?

"మేము ఫాసిస్టు వ్యతిరేకులం. ఫాసిస్టుల నెదుర్కొంటానికే మా యావచ్ఛక్తినీ కేంద్రీకరిస్తున్నాం. అందుకే ఈ నిర్బంధంకూడా...." అని నోటినిండా కబుర్లుచెప్పే యజమానులు, నిజానికి, ఏవిధంగా ఫాసిస్టుల నిగ్రహణకు తోడ్పడుతున్నారు ?

- నూటికి 68 పాళ్ళు ధరలు పెరిగిపోయాయి. కాని, యజమానులు రైల్వే కార్మికుల జీతం హెచ్చించింది నూటికి 38 పాళ్ళు మాత్రం ! కళ్ళనీళ్ళు తుడవడానికి, కరువుభత్యం ఇచ్చామని అమాయక వర్కర్లను మోసపుచ్చడానికి, వర్కర్ల ఆందోళన తీవ్రత తగ్గించడానికి, ఇచ్చిన ఈ అలవెన్సు అలవెన్సుగాదు. కార్మికులకు న్యాయంగా, హక్కుగా, రావలసిన మొత్తంలో దొంగతనం అన్నమాట !

గుంటకల్ రెల్వే పనివారు, బెజవాడ రైల్వే పనివారు, కరువుభత్యం పెంచటానికి జేసే ఆందోళన సారాంశం ఇది.

పైజెప్పిన అంకెలు జులై నెలవి. అప్పటినుంచీ యుద్ధ తీవ్రత హెచ్చిపోతూఉంది. దానివల్ల వచ్చే ఆర్థిక కష్టాలూ హెచ్చిపోతున్నాయి. జీవితావసరమైన దినుసుల ధరలు నూటికి 200, 300 లు పెరిగిపోయాయి. కాని రైల్వే కార్మికుల కరువుభత్యం మూలవిరాట్టులాగ చలనం లేకుండా ఉన్నది.



ఈ సమస్య యావద్భారతదేశ సమస్య. దీనిని వెంటనే పరిష్కరించి, పనివారల తీవ్ర అసంతృప్తిని తగ్గించాలి.

ఇందుకు—

200 రూపాయల కింది జీతగాళ్ళకు- అందరికీ సమంగా 15 రూపాయల కరువుభత్యం ఇవ్వాలి అని 23-10-42 న సమావేశమైన బెజవాడ రైల్వే కార్మికుల సంఘం తీర్మానం గావించిది. ఈ పద్ధతుల పైనే గుంటకల్ రైల్వే వర్కర్లుకూడా ఆందోళన గావిస్తున్నారు.

మీ "జోనులు" మా చీలికలు

కార్మికుల కోర్కెల సాధనకు పోరాటమే మార్గం. పోరాటానికి ఐక్యత ప్రధాన ఆయుధం. ఈ ఐక్యతను భగ్నం గావిస్తే యజమానులు నిశ్చింతగా, గుండెమీద చేయి వేసికొని కూర్చోవచ్చు.

ఈ ఉద్దేశంతోనే రైల్వే యజమానులు, కరువుభత్యం నిర్ణయానికి జోనులు పెట్టారు. ఈ జోనుల గురించి గుంటకల్ రైల్వే వర్కర్ల యూనియన్ ప్రచురించిన ఒక కరపత్రం ఈ విధంగా చెపుతూఉంది. "జోనుల పద్ధతి, పనివారలలో చీలికలను కొనితేవడానికి ప్రయోగింపబడింది." అందువల్ల ఈ పద్ధతిని రద్దుచేయాలి అని గుంటకల్ రైల్వే వర్కర్లసంఘం కోరుతున్నది.

దీంట్లోకూడా జాతివిచక్షణే !

రైల్వే యజమానులు పనివార్లను విడదీసే ఎత్తుగడలు ఇంతటితో పోవా ? వీరు రేషను అలవెన్సు వర్కర్లందరికీ సమానంగా ఇవ్వడంలేదు. కొందరికి ఎక్కువ, కొందరికి తక్కువ. ఆంగ్లోఇండియన్లకు 22-8-0 రేషను అలవెన్సు. ఆంగ్లోఇండియనులు కానివారికి తక్కువ. ఇందులోకూడా, సామ్రాజ్యవాద నైజం చూపించే జాతి విభేదాలు! "రేషను అలవెన్సు యిచ్చుటలో జాతి భేదాలు లేవతీయటం చాలా అన్యాయము. ఆంగ్లోయిండియన్లకు ఇస్తున్న రీతిని ఇండియన్లకు కూడా 22-8-0 ఇవ్వాలి." అని బెజవాడ రైల్వే వర్కర్ల సంఘం తీర్మానించింది. అంతేగాదు. ఈ విషయంలో అఖిలభారతరైల్వేపనివారల సమ్మేళనం కలుగచేసుకోవాలి. దేశమంతటా సరైన ఆందోళన తీసికొని రావాలి. రైల్వే బోర్డును ఒత్తిడిచేసి వంచాలి, ఇందుకు ఆ సమ్మేళనం ఏ కార్యక్రమం ఇచ్చినా అనుసరించటానికి సిద్ధంగా ఉన్నాం, అని ఆ తీర్మానం నొక్కివక్కాణించింది.

డాక్టరు దుర్నీతి

పై తీర్మానం, మరొకభాగంలో బెజవాడ రైల్వే మెడికల్ డిపార్టుమెంటులో జరుగుతున్న లంచగొండితనాన్ని ఈ విధంగా వెల్లడిచేస్తోంది. "బెజవాడ మెడికల్ డిపార్టుమెంటులో కార్మికులకు మందులిచ్చునప్పుడు లంచాలను తీసికొనటం, అలా ఇవ్వని వారిని మెడికల్‌గా అన్‌ఫిట్ చేయటం, సిక్కులో పెట్టకపోవడం, చిన్న జీతగాండ్రను పక్షపాతంతో జూడడం, మొదలగు చర్యలద్వారా కార్మికులను మానసిక, ఆర్థిక బాధలకుగురిచేయుచున్న........డాక్టరు............గారి అక్రమ చర్యలను ఈ సభవారు తీవ్రంగా ఖండించుచూ, వీరిపై తగు చర్యను తీసికొని వెంటనే ట్రాన్స్‌ఫరు చేయాలని చీఫ్ మెడికల్ ఆఫీసరును ఈసభవారు కోరుచున్నారు."

మరికొన్ని ఇబ్బందులు

రైల్వే పనివారల కష్టాలు ఇంతటితో పోవా ! రైల్వేలో మిలిటరీ యూనిట్లను అమలులో పెట్టినప్పటినుండీ, పనివారలకు, ఎంత అవసరంగా ఉన్నాసరే, శెలవుగాని, రైల్వే ప్యాసుగాని దొరకడం దుర్లభంగా ఉంది. శలవు, ప్యాసు, కార్మికుల కనీసపు హక్కులు. ప్రాణానికి తెగించి, మిలటరీ యూనిట్లలో జేరి, ఫాసిస్టు దురాక్రమణదారులను అన్నివిధాలా ఎదుర్కొని, మాతృదేశరక్షణకు పూనుకున్న కార్మికులకు, సౌకర్యాలు, ఉత్సాహం కల్గించడానికి బదులు, రైల్వే యజమానులు, ఈ విధంగా, కనీసపు హక్కులుకూడా నిరాకరించి, ఇబ్బందులుపెడుతున్నారు. ఈ అధికారుల వైఖరి ఫాసిస్టు వ్యతిరేకతకు ముందంజవేసిన కార్మికులలో అశాంతి, అసంతృప్తి కల్గిస్తాయి. ఇది దేశానికి చాలా నష్టం కలుగజేస్తుంది. రైల్వే యజమానులు ఇట్టి విధానాన్ని కట్టిపెట్టి కార్మికుల కష్టాలను వెంటనే పరిష్కరించాలి. ఇదే బెజవాడ రైల్వే పనివారల సంఘపు తీర్మానంయొక్క సారాంశం.

బెజవాడ రైల్వే కార్మికులు తమ ఆర్థిక అవసరాలను సరైన రాజకీయ అవసరాలతో కలుపుతున్నారు. జాతీయ ఐక్యతా చైతన్యం వారిలో కలుగుతోంది. అప్పటికే, చాలమంది, వైస్రాయికి, కాంగ్రెసు నాయకులకు, జిన్నాకు పంపబడే విజ్ఞప్తులపై సంతకాలు చేసారని వారి సంఘ రిపోర్టు తెలుపుతోంది.

సవరణ

కృష్ణాజిల్లా రైతుసంఘం, నెల్లూరుజిల్లా వ్యవసాయ కూలీసంఘం, ప్రజలకవసరమైన బియ్యం వగైరా సరకులు నిల్వవుంచినమీదటనే మిగతా సరకును యితరచోట్ల కెగుమతిచేయాలనితీర్మానించాయి. ఇది సరికాదని మేము గత సంచిక సంపాదకీయంలో విమర్శించాము. ఒకప్లానుప్రకారం యెగుమతులు, దిగుమతులు, జరగాలనీ, ఆప్లాను ఒక జిల్లా అవసరాలనుబట్టికాక మొత్తం దేశ అవసరాలనుబట్టి వుండాలనీ, మా వుద్దేశం. ప్రజల అవసరాలకు సరిపోయే సరకును కూడా ఉంచుకొనకుండా యితరచోట్ల కెగుమతిచేసి, ఆ ప్రాంతములో కరువు వచ్చే పరిస్థితులు యేర్పడచరాదనే ప్రధాన సూత్రాన్ని మేమంగీకరించుతాం. ఈ సూత్రమును వెల్లడించుచున్న పై సంఘాల తీర్మానములు సరియైనవేనని అంగీకరించుతాం. కాని, ప్రజల అవసరాలేవో, ఎగుమతులెంతెంత చెయ్యాలో నిర్ణయించ గల్గినది ప్రజా ప్రతిధులతోగూడిన కేంద్ర ప్లానింగ్ కమిటీయేగాని, జిల్లాసంఘాలు కాదనే అంశాన్ని తెలియపరచుటకే ఆ విషయాన్ని మేము ఉదహరించాము. మా ఉద్దేశం, ఆహార పదార్థాల కంట్రోలు సమస్యను ఒక నిర్ణీతప్లాను ప్రకారం పరిష్కారం చేయాలనే. ఆప్లాను యెలా వుండాలో, సంపాదకీయంలో తెలియజేశాము.

— సంపాదకవర్గం

విలేఖరులకు విజ్ఞప్తి

కామ్రేడ్స్,

ఐక్యతాఉద్యమాన్ని మీ ప్రాంతాల ప్రజలలో ప్రచారం గావించేటప్పుడు, మహజర్లపై సంతకాలు తీసుకొనేటప్పుడు, ఎవరెవరు, ఏవిధంగా, ఉద్యమంయొక్క ప్రధాన నినాదాలను అర్థం చేసుకొంటున్నారో మీ రెంతవరకు ప్రజలకు వాటిని బోధించగలిగారో, తెలియజేసే అనుభవాలను చిన్న చిన్న వ్యాసాల రూపంలో వ్రాసి పంపగోరుచున్నాం.

— సంపాదకవర్గం

స్వీకారం

1. బీళ్లు దున్నేరు
వెల : 1—4—0
రచయిత :- మైకేల్ షోలోకోవ్.
విశ్వసాహిత్యమాల, ముంగండ.

2. రష్యారాజ్యం - జర్మనీయుద్ధం
(బొబ్బిలిపాట వరుస)
వెల : 0—4—0
రచయిత :-
శ్రీ దామరాజు పుండరీకాక్షుడుగారు.
స్వరాజ్యసోపాననిలయం, గుంటూరు.

ఇండియాను రక్షిస్తున్నది సోవియట్ సైన్యం



కామ్రేడ్ కాలినిన్

సోవియట్‌రష్యా అధ్యక్షుడైన మైకేల్ కాలినిన్ యీక్రింది ప్రకటన గావించాడు: "1918 వ సంవత్సరంనాడే జర్మన్లు ఉక్రెయిన్ కాకేసస్‌లను, టర్కీరేవు పట్టణమైన బ్రెస్ట్ జాంటును, ఏషియా మైనర్‌లో వున్న దేశాలను పూర్తిగా స్వాధీనం చేసుకొని ఇండియాపై దుముకాలనీ; ఆవిధంగా ప్రపంచాధిపత్యం సంపాదించాలనీ, ఆలోచనలు ప్రారంభించారు....కాని యీ రోజున సోవియట్‌సైన్యం శత్రువు యొక్క పురోగమనాన్ని అరికట్టి తీవ్రమైన పోరాటం సల్పుతోంది. ఉత్తర కాకేసస్‌ను రక్షించడానికి ట్రాన్స్‌కాకేషియన్ రిపబ్లిక్కు లన్నీ కలిసి యుద్ధరంగంలో ప్రవేశించాయి. కాకేషియన్ ప్రజల్ని బానిసత్వంలో ముంచి, కాకేసస్‌పర్వతపంక్తుల మీదుగా

మన రాజకీయాలు

ఇండియాకుదోద్దు వేయాలని జర్మనులఆశ. కాబట్టి, కాకేసస్‌లో మనం దురాక్రమణదారుల్ని పాతిపెట్టి, వారికి సమాధులు కట్టవలసి యుంది."

ఇతడుగావించిన పై ప్రకటన తన ప్రజలకు హెచ్చరిక మాత్రమేగాదు. ఇండియాను శాశ్వతంగా సామ్రాజ్యశృంఖలలో బిగించాలని చూచే బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కొరకు వార్నింగ్. యుద్ధప్రయత్నాలను భగ్నంచేయడం ద్వారా కాక, వాటిని ప్రజలహస్తగతం చేసుకొని స్వదేశరక్షణకై పోరుసల్పడంద్వారా, స్వరాజ్య సాధనకు కృషిచేయవలసిందని భారతీయు లందరికిని గావించిన విన్నపం. ఇండియాను నేడు రక్షిస్తున్నది కాకేసస్‌లో యుద్ధంచేసే సోవియట్ వీరయోధులనే సత్యాన్ని కాలినిన్ మనకు తెలియచెప్పుతున్నాడు.

వెండల్‌విల్కీ ఉపన్యాసం

భారతదేశ సమస్యను గురించి ఒక్క రష్యాలోనేగాక, అమెరికాలోకూడా తీవ్రమైన ఆందోళన సాగుతోంది. అమెరికా ప్రభుత్వం తరఫున యిటీవల రష్యా- చైనా మొదలైన దేశాలు ప్రయాణంచేసి తిరిగివచ్చిన వెండెల్ విల్కీ ఈ క్రింది విధంగా ఒక రేడియో ఉపన్యాసం యిచ్చాడు. "నేనుప్రయాణంచేసినప్రతి దేశంలోను, ప్రాచ్య దేశాలలో నివసించే 100 కోట్లమంది ప్రజలకు ఎట్టి స్వాతంత్ర్యపత్రము లేనేలేదా ? అని అనేకులు నన్నుప్రశ్నించారు. ఆసియాఖండమంతటిలోను ఈప్రశ్న నేడు మారు మ్రోగుతోంది. ఇండియా సంగతి ఏమిటి ? అని అడుగని వ్యక్తిలేనేలేడు. ....గోడమీది పిల్లివాటంతో కూర్చున్న అమెరికాను గురించి ప్రాచ్య దేశస్థులు తీవ్రంగా అసంతృప్తి చెందియున్నారు. నిజంగా మనం స్వాతంత్ర్యం కొరకు పోరాడుతున్నామో లేదో, పోరాడుతూంటే అది యెలాంటి స్వాతంత్ర్యమో, వారికి తెలియదు. ప్రాచ్యఖండవాసులందరిదృష్టిలో స్వాతంత్ర్యం అంటే అర్థం, వలసరాజ్యాల నాసిస పరిపాలన కాదు. కొందరు మరికొందరిపై పెత్తనం వహించి పరిపాలించడం స్వాతంత్ర్యం కానేరదని మీరు (అమెరికన్లు) నమ్మండి. ఈ విధానాన్ని ధైర్యంగా దాటుకోవానికిరాదు. మనం యుద్ధంచేస్తున్నది....భారతదేశ సమస్య మన సమస్యే. అంత విశాలమైన దేశాన్ని జపాన్ జయిస్తే, నష్టపడేది మనం."

బ్రిటన్ అమెరికాలలో ఆందోళన

వెండెల్‌విల్కీ గావించిన పైప్రసంగాన్ని షుమారు 3 కోట్లమంది అమెరికన్లు విన్నారు. దాదాపు 1000 మంది అమెరికన్ పౌరులీతన్ని అభినందిస్తూ టెలిగ్రాములు పంపించారు.

లూయీ ఫిషర్ అనే అమెరికన్ ప్రముఖుడు "నేషన్" అనే పత్రికలో యీక్రిందిఅభిప్రాయాలు వెల్లడించాడు. "ఇండియాలోచిక్కులు సంభవించడమంటే, యుద్ధం చిర కాలంవరకు కొన సాగించడ మన్నమాట. కాబట్టి ఈ విషయంలో అమెరికాకు కూడా సంబంధం వుంది. గాంధీజీ యొక్క శాసనోల్లంఘనోద్యమంద్వారా యేర్పడిన సమస్య, భారత దేశంలో జాతీయ శక్తులకంటె యెక్కువ బలం పోలీసులకున్నదా, లేదా ? అని కాదు. మన మీ యుద్ధంలో ఎందుకొరకు పోరాడుతున్నాం ? అనే ప్రశ్నకు జవాబు చెప్పవలసి యుంది. గాంధీపై సాగించబడిన యీదాడి రెండవరంగం కాదువద! అనేక పరాజయాలతర్వాత బహుశా బ్రిటిష్‌వారు గాంధీని జయించగలుగుతారేమో ! కాని, ఆవిధంగా గాంధీజీ యొక్క ఉద్యమాన్ని అణచివేస్తే ఫలితం ఏమిటి? భారతీయులలో క్రోధాగ్ని వ్యాపిస్తుంది; జపాన్ - జర్మనీలకు ఇండియా సులభంగా లొంగిపోతుంది.... అయితే, మరొక దేశమేదైనా బ్రిటిష్ ప్రభుత్వాన్ని ముల్లుకర్రతో పొడిస్తేగాని ఆకస్మాత్తుగా వారు తమ విధానాన్ని మార్చుకోరు. అమెరికా ఒక్కటే యీ పని చేయగలిగిన దేశం."

దీని తర్వాత లూయీ ఫిషర్ మరొక దీర్ఘమైన వ్యాసంలో భారతీయుల మనోభావాలను అతిచక్కగా వర్ణించాడు. "శాసనోల్లంఘనానికి ముందు గాంధీజీ మిత్రరాజ్యాల తరఫున నాయకులెవరైనా వచ్చి రాజీకి ప్రయత్నించుతారని ఆశించాడు. రూజ్వెల్టుకు అతడు వ్రాసిన జాబునుగురించి గాంధీజీ నాతో యిలా అన్నాడు. 'నన్నుఒప్పించడానికి మీ అధ్యక్షుడు ప్రయత్నిస్తే, తప్పకుండా అందుకు నేను సిద్ధమే' మధ్యప్రాచ్య దేశాలకు ఇండియా యుద్ధవ్యూహానికనుకూలమైన దేశం. బ్రహ్మాండమైన నైతిక శక్తి భారతీయులలోవుంది. ఏవరోఒకరు ధైర్యంతో ముందుకువచ్చి, తక్షణమే కార్యసాధనకు దిగాలి. రూజ్వెల్టు యిందుకు తగినవాడు. బ్రిటిష్‌ప్రభుత్వం గాంధీజీతో మాట్లాడితీరాలని రూజ్వెల్టు పట్టుపట్టాలి."

అమెరికాలో యీ విధంగా రోజు రోజుకు పెరుగుతూన్న ఆందోళనఫలితంగా, రూజ్వెల్టు కొద్దిగా కదిలాడు. అట్లాంటిక్ ఛార్టరు మానవజాతి కంతకూ వర్తిస్తుందని అతడు ప్రకటించవలసి వచ్చింది.

ఇలాగే బ్రిటన్‌లోకూడా ప్రజాభిప్రాయం భారత జాతీయ వాంఛను బలపరుస్తోంది, మిత్రరాజ్యాలన్నీ కలసి భారతదేశ సమస్యను పరిష్కరించవలసిందని లండన్‌లో ఇండియా లీగ్ తరఫున జరిగిన బహిరంగసభలలో ఏకగ్రీవంగా తీర్మానాలు గావించబడ్డాయి. ఇటీవల సి. రాజగోపాలాచారి యిచ్చిన సూచనలపై సంప్రదింపులు జరుపడానికి లండన్‌నరమ్మని సోరెన్సన్ మొదలైన పార్లమెంటు సభ్యులు ఆహ్వానిస్తున్నారు. యూనియన్‌ఆఫ్ డెమాక్రటిక్ కంట్రోలు అనే సంస్థ తరఫున వుడ్‌మన్‌అనే ప్రముఖుడుకూడా సి. ఆర్. ను అభినందించాడు. ఈవిధంగానే డెయిలీహెరాల్డు పత్రిక (లేబర్‌పార్టీ)న్యూస్టేట్సుమన్(లిబరల్ పార్టీ) పత్రిక తమ సంపాదకీయాలలో సి. ఆర్. సూచనల కంగీకారం తెల్పుతూ, ఇంగ్లండ్‌కు ఆహ్వానించాయి. ఇట్టి హెచ్చరికనే గావిస్తూ 'టైమ్సు' (కన్సర్వేటివ్‌పార్టీ) పత్రికలో మక్లీ అనే విలేఖరివ్యాసంవ్రాశాడు. వెండెల్‌విల్కీ అమెరికాలో యిచ్చిన ఉపన్యాసాన్ని గురించి 'మ్యాంచస్టరు గార్డియన్' పత్రిక (లిబరల్) వ్యాఖ్యానిస్తూ, బ్రిటనులో కూడా ప్రజాభిప్రాయం విల్కీ ప్రకటించిన భావాలకు అనుకూలంగానే వున్నదనివ్రాసింది. ఆ ఉపన్యాసాన్ని జాగ్రత్తగా చదువవలసిందని బ్రిటిషుప్రభుత్వాన్ని హెచ్చరించింది. "టైమ్సు" వంటి కన్సర్వేటివ్ పార్టీ పత్రిక సహితం మిత్రరాజ్యాలన్నీ కలసి భారతదేశ సమస్యను పరిష్కరించాలని సూచించింది. జాతీయ ప్రతిష్టంభనను తొలగించడానికి వెర్నన్ బార్లెట్, బెర్ట్రాండ్‌రస్సెల్, వంటి సుప్రసిద్ధ రాజకీయ - విజ్ఞానవేత్తలు తమ ప్రభుత్వానికి కొన్ని సూచన లిస్తున్నారు. భారతజాతీయ నాయకులతో తక్షణం సంప్రతింపులు జరుపాలని వారు హెచ్చరించారు.

"నేషనల్‌కాల్ " అనే ఢిల్లీపత్రికకు ఒక ఆంగ్లేయ సైన్యాధికారి వ్యాసం వ్రాస్తూ, ఇండియాకు స్వాతంత్ర్య మీయడం అవసరమని ప్రభుత్వాన్ని హెచ్చరించాడు.

చైనా ప్రముఖుని వ్యాసం

లిన్‌యుటాంగ్ అనేవిఖ్యాత చైనావిలేఖరి "స్వేచ్ఛా ప్రపంచం" అనేపత్రికలో ఈ విధంగా వ్రాశాడు : "ఇండియాలో నేడు జరిగే ఘటనలను మనం ఊరుకోక విమర్శించడంకాకుండా రెండు మిత్రరాజ్యాల (ఇండియా, ఇంగ్లండ్) మధ్య జరిగే కలహాన్ని మనంకూడా బాధ్యత వహించి పరిష్కరించడం మన విధి. భారతీయులకు స్వాతంత్ర్యం కావాలి. క్రిప్సు దానిని నిరాకరించాడు. మిత్రరాజ్యాలతో కలిసి వారు కూడా స్వతంత్ర్య హోదాతో యుద్ధంలో పాల్గొనగోరుచున్నారు."

ఇండియాలో నిరంకుశవిధానం

ఈవిధంగా ప్రపంచ మంతట భారతీయుల జాతీయ వాంఛకు బలం హెచ్చుతూంటే, యిటు ఇండియాలో నిరంకుశాధికారవర్గం కంపించిపోతూంది. నిర్బంధ విధానం తప్ప మరొక సాధనం దానికి దొరకడంలేదు. విధ్వంసకచర్యలలో పాల్గొన్నందుకు అనంతపూర్, కర్నూల్, తిరువన్నామలై, కరాచి, మొదలైన ప్రదేశాలలో కొరడాదెబ్బల శిక్ష విధించబడింది. పాట్నాజిల్లాలో 3 లక్షల రూపాయల సాముదాయక పన్నులో 2½ లక్షలు వసూలు చేయబడింది. బీహార్ రాష్ట్రంలో ఒక గ్రామంలో ప్రజలు తమస్వంత ప్రభుత్వాన్ని నడుపుకొంటున్నారనే నేరానికి మిలిటరీ ఆగ్రామస్థులపై తుపాకులు కాల్చడం వల్ల ముగ్గురు హతులయారు. కొద్దిరోజులలో రష్యాకు పయనంకాబోతూన్న భారత సుహృద్భావ సంఘ సభ్యులు విమానంలో ప్రయాణం చేయడానికి అనుమతి నిరాకరించబడింది. ఇంతేకాదు, చైనానుండి ఈ మధ్య భారతదేశాన్నిగురించి యెట్టివార్తలు రాకుండా ఇండియా ప్రభుత్వం "కాపుదల" చేసింది. ఇండియానుంచి ఇంగ్లండుకు, ఇంగ్లండునుంచి ఇండియాకు, పంపబడే వార్తలు ఏవిధంగా రెండేసిసార్లు ఇంగ్లండులోను, ఇండియాలోను, కూడా సెన్సార్‌చేసి అందకుండా చేస్తున్నారో 'మ్యాంఛెస్టర్ గార్డియన్' పత్రికలో ఉదాహరణ పూర్వకంగా ఒక వ్యాసం ప్రచురించబడింది. ఈ బ్రిటిష్ నిర్బంధవిధానం, ఈ సెన్సారుషిప్పు నిరంకుశత్వం, సామ్రాజ్యవాదుల బలహీనతను, గాభరాను, మాత్రమే వెల్లడిస్తాయి.

మళ్ళీ జపాన్ బాంబులు

బ్రిటిషు ప్రభుత్వం యొక్క ఈ నిరంకుశ పంథా జపాన్ ఫాసిస్టులను ఇండియాపైకి పురిగొల్పుతోంది. గత నెలాఖరున జపాన్ విమానాలు 2 సార్లు అస్సాం - బెంగాల్ విమానాశ్రయాలపై బాంబులవర్షం కురిపించాయి.

కామ్రేడ్
కంభంపాటి సత్యనారాయణ

ఎంతమంది స్త్రీపురుషులు, బాలబాలికలు, ఆ దాడులలో హతులయారో! ఎంతమంది యిండ్లు ధ్వంసమయాయో! విమానాశ్రయాలను భగ్నం చేసి, సులభంగా తమ సేనలతో దేశాన్ని ఆక్రమించుకోవడమే ఫాసిస్టుల ఉద్దేశ మనదంలో సందేహంలేదు. ఈ ప్రమాదాన్ని ఒకవైపున బ్రిటిషు సామ్రాజ్యవాదులు గుర్తించక పోగా, బెంగాల్-అస్సాం రాష్ట్రాలలో కమ్యూనిస్టులవంటి తీవ్రఫాసిస్టువ్యతిరేకుల్ని అనేక నిర్బంధాలకు గురిచేస్తున్నారు. మరొకవైపున దేశభక్తులు బ్రిటిషుప్రభుత్వంపై గల ద్వేషంతో దేశరక్షణలను ధ్వంసం చేస్తున్నారు. బొంబాయి, షోలాపూర్, లక్నో, ఢక్కా, కలకత్తా బెంగుళూరు మొదలైన పట్టణాలలో ప్రజల్ని భీతావహంలో ముంచడానికి బాంబులు వేస్తున్నారు. జిన్నా అయినా ఈ జాతీయ సంక్షోభాన్ని అంతమొందించడానికి ముందుకు వస్తున్నాడా అంటే, ససేమిరా అంటూ తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళని వాదిస్తున్నాడు.

ఇట్టి క్లిష్టపరిస్థితులలో భారతీయుల కర్తవ్యం ఏమిటి ? మన దేశంలో జాతీయైక్యత లేకపోవడమే సామ్రాజ్యవాదులకు నేడుగలబలం. జాతీయైక్యతను సాధించడ మొక్కటే మన దేశానికి మోక్షసాధనం. దేశమంతట హిందూ ముస్లిం ప్రజలలో జాతీయైక్యత యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ కమ్యూనిస్టులు ఈ వారంలో బ్రహ్మాండమైన జాతీయైక్యతా ఉద్యమాన్ని సాగిస్తున్నారు. ఈప్రజాఉద్యమం వల్ల జాతీయప్రభుత్వాన్ని నిర్మించుకొనగలం. అప్పుడే మన దేశాన్ని జయప్రదంగా జపాన్ ఫాసిస్టులదాడి నుండి రక్షించుకొనగల్గుతాం. కాబట్టి జైళ్ళలో వున్న కాంగ్రెసు నాయకుల విడుదలకు ప్రభుత్వంపై బలమైన ఒత్తిడి తీసుకురావల్సి యుంది. కమ్యూనిస్టులు ప్రారంభించిన ఐక్యతాఉద్యమంలో దేశీయులందరు పాల్గొనాలి.

END OF ISSUE